



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 182 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల ఆదివారం 8 మార్చి 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE 182 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SUN 8 MARCH 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కొత్తగా ఆలోచించే వారి కోసం
# 'క్రియేటివ్ సిటీ'
## సీఎం చంద్రబాబు ప్రకటన



- ఢిల్లీలో రైసినా డైలాగ్-2026 సదస్సు
- ఈ సదస్సుకు హాజరైన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఘనత
- త్వరలో అమరావతి వేదికగా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు
- సాంకేతికతతో భారత్‌కు రివర్స్ మైగ్రేషన్ తప్పదని సీఎం వెల్లడి
- దక్షిణాదిలో తగ్గుతున్న జననాల రేటును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

పెన్ పవర్ డెస్క్:"విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన 'క్రియేటివ్ సిటీ'ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని

మిగతా 2లో



## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్న సజ్జల
- తమ హయాంలో తిరుమలలో క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని వెల్లడి
- బీఆర్ నాయుడు విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ను రాజకీయంగా ఎదుర్కోలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.లడ్డూ ప్రసాదంలో జంతువుల

మిగతా 2లో



## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్:గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు.మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని

మిగతా 2లో

## హార్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై
# ఇరాన్ దాడి...
## మరింత ముదిరిన ఉద్రిక్తతలు



- హార్ముజ్ జలసంధిలో 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో డ్రోన్‌తో విరుచుకుపడ్డ ఆర్మీ
- శత్రు దేశాల నౌకలకు జలసంధిలో అనుమతి లేదన్న ఇరాన్
- గత ఎనిమిది రోజులుగా జలసంధి తమ ఆధీనంలోనే ఉందన్న ఐఆర్‌జీసీ
- జలసంధిని పూర్తిగా మూసివేయలేదని ఇరాన్ ప్రభుత్వం స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. శనివారం హార్ముజ్ జలసంధి గుండా వెళుతున్న 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దాడి చేసింది. తమ హెచ్చరికలను బేఖాతరు చేసినందుకే ఈ నౌకపై దాడి చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

మిగతా 2లో



## ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో లక్ష్మీదుర్గను ఏ-2గా చేర్చిన సిట్ అధికారులు
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ కోర్టులో ఛార్జిషీట్
- కోర్టు ఆదేశాలతో లక్ష్మీ దుర్గ కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

మిగతా 2లో




## చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- జయసుధకు ఏఎన్నార్ అవార్డు
- ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
- ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
- ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)

పెన్ పవర్ డెస్క్:2025లో విడుదలైన చిత్రాలకు సంబంధించి 'గద్దర్ ఫిలిం అవార్డ్స్-2025' విజేతలను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. జ్యూరీ సభ్యులు విజేతల పేర్లను ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. 2025 జనవరి 1 నుంచి

మిగతా 2లో



## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- చంద్రబాబు జనాభా విధానంపై వైఎస్ షర్మిల వ్యంగ్యం
- ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న
- నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన
- రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు


పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు

మిగతా 2లో


## భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న మూడో దేశంగా భారత్
- గతేడాదితో పోలిస్తే కొత్తగా చేరిన మరో 24 మంది కుబేరులు
- ఏకంగా రూ.112.6 లక్షల కోట్లకు చేరిన మొత్తం సంపద
- హెల్త్‌కేర్ రంగం నుంచే అత్యధికంగా కొత్త బిలియనీర్లు
- ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను కోల్పోయిన ముంబై

పెన్ పవర్ డెస్క్:భారత్‌లో సంపన్నుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. తాజాగా విడుదలైన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026' ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా తర్వాత భారత్ ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. దేశంలో సంపద సృష్టి, ఆర్థిక వృద్ధి బలంగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి



మిగతా 2లో



## సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతనం.. ప్రపంచంలోనే అత్యధిక జీతం!
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతన ప్యాకేజీ ప్రకటన
- రాబోయే మూడేళ్లలో రూ. 6,361 కోట్లు ఆర్జించే అవకాశం
- కంపెనీ పనితీరు ఆధారంగా రెట్టింపు కానున్న స్టాక్ యూనిట్లు
- వేమో, వింగ్ వంటి అటానమస్ వెంచర్ల వృద్ధికి ప్రోత్సాహకాలు

మిగతా 2లో



## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

- ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
- ఇప్పటి వరకు చేసిన దాడికి 'సారీ' అన్న పెజెష్కియాన్
- గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు
- పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ప్రతిదాడి చేస్తామని హెచ్చరిక

## ఎడిటర్ వ్యూ

# గల్ఫ్ బాధితులకు రక్షణ ఏదీ?

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులతో పశ్చిమాసియా దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. భీకర యుద్ధం జరుగుతున్న ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో సుమారు కోటి మంది భారతీయులు భిక్కుభిక్కుమంటూ దినమెక గండంగా గడుపుతున్నారు. గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా యూఏఈ (దుబాయి)లో 43 లక్షలు, సౌదీ అరేబియాలో 27 లక్షలా 47 వేలు, ఖతార్, కువైట్..ఇలా ఆయా దేశాల్లో లక్షల సంఖ్యలో మన భారతీయులు ఉద్యోగ, ఉపాధి కోసం వలస వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. నిత్యం మిసైళ్ల వర్షం కురుస్తున్న ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల్లోనూ యాభై వేల మంది వరకు భారతీయులున్నట్లు అంచనా. ఈ రెండు దేశాల్లో మరింత భయానక వాతావరణం నెలకొన్నట్లు స్పష్టమౌతుంది. రానున్న రోజుల్లో మరింత భీకర యుద్ధం జరిగే అవకాశాలున్నట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవచ్చు. పొట్ట చేతపట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయుల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో రోజు వారి కూలీగా చేరిన వారే ఎక్కువగా ఉన్నారు. షిప్పింగ్, పోర్టు కంపెనీల్లో భారతీయులు పనిచేస్తున్నారు. వారి పరిస్థితి ముందు నుయ్యి-వెనుక గొయ్యిలా మారింది. ఇప్పటికే దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి చెందినట్లు వార్తలొచ్చాయి. యుద్ధ వాతావరణంలో బయట పనులు చేయలేని పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో వారి జీవన మనుగడ అత్యంత క్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. స్వస్థలాల్లో అప్పులు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయులకు ప్రస్తుత యుద్ధవాతావరణంలో మన ప్రభుత్వాల నుండి భరోసా లభించడం లేదు. ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో యూఏఈ పాలకులు ప్రవాసీయులకు కొంత భరోసా కల్పిస్తున్నారు. విమానాలు రద్దయినందున ఆయా హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని బలవంతంగా ఖాళీ చేయించవద్దని ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడి ప్రజలకు కొంత సహకారం అందిస్తున్నారు. కాగా..మన భారత ప్రధాని పలు దేశాధినేతలతో ఫోన్లో మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. ఢిల్లీలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. వీటితో చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భరతీయులకు రక్షణతో పాటు ఇక్కడి కుటుంబాలకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలేవీ కనిపించక పోవడం బాధాకరం. గల్ఫ్ దేశాల్లో భారతీయులు తీవ్ర భయాందోళనలో భిక్కు భిక్కుమంటూ గడుపుతున్న నేపథ్యంలో భారత ప్రధాని పుదుచ్చేరి, తమిళనాడు, కెనడా పర్యటనలు చేశారు. కేంద్ర మంత్రులు సైతం సొంత నియోజక వర్గాల పర్యటనలకే పరిమితమైనట్లు తెలుస్తోంది. దీంతో ఆయా దేశాల్లోని భారతీయుల బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలున్నాయి. దేశ వ్యాప్తంగా ఆయా పార్లమెంటు నియోజక వర్గాల వారీగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి..ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీంతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులకు రక్షణతో పాటు అహారం, ఇతర అవసరాలు తీర్చేలా కార్యచరణ చేపట్టాల్సి ఉంది. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం భారత్‌పై ఏ మేరకు పడుతుందనే అందోళన నెలకొంది. ప్రధానంగా హోర్ముజ్ జలసంధి మూసివేతతో చమురు ట్యాంకర్ల నిలిపివేత ప్రభావం ధరల పెరుగుదలకు కారణమయ్యే అవకాశాలున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే బ్యారెల్ ధర 80 డాలర్లకు పెరిగిందని, క్రమ క్రమంగా మరింత పెరిగే అవకాశాలు లేక పోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచబోమనే కేంద్ర ప్రభుత్వ ప్రకటన కోసం దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పెట్రో ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాభై శాతం వ్యాట్‌ను వసూలు చేస్తున్నందున ప్రపంచ మార్కెట్‌లో క్రూడ్ అయిల్ ధర పెరిగినా నష్టాలు మాత్రం వచ్చే అకాశాలు లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ బహిరంగ మార్కెట్‌లో పెట్రో ధరలను ప్రభుత్వం పెంచితే..అనివార్యంగా సరుకులు, వస్తువుల ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం దేశవ్యాప్త ఆందోళనలకు దారితీసే అవకాశాలున్నాయి.

## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

కొవ్వు, కెమికల్స్ కలిపారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని సజ్జల కొట్టిపారేశారు. వైసీపీ హయాంలోనే తిరుమలలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మార్కెట్‌లో హెరిటేజ్ నెయ్యి ధర కంటే ఇందాపూర్, అమూల్ నెయ్యి ధరలు తక్కువగా ఉన్నాయని... కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నెయ్యి కాంట్రాక్టుల విషయంలో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి కాంట్రాక్టుల వెనుక భారీ ఆర్థిక కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి స్వామివారి సొమ్మును దోచుకోవడమే ఈ విష ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సంబంధించిన వీడియోల వివాదంపై సజ్జల స్పందిస్తూ... గతంలో తమ హయాంలో సినీ నటుడు పృథ్వీపై ఆరోపణలు రాగానే తక్షణమే రాజీనామా చేయించామని, కానీ ఇప్పుడు బీఆర్ నాయుడి విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాలపై చంద్రబాబుకు విశ్వాసం లేదనే విషయం మరోసారి అర్థమయిందని అన్నారు.

# సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరిగా నిలిచారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఆయనకు రాబోయే మూడేళ్ల కాలానికి గాను ఏకంగా 692 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,361 కోట్లు) భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ ప్యాకేజీ ఆయన పనితీరు, కంపెనీ వృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉండటం విశేషం. ఈ భారీ ప్యాకేజీలో ఎక్కువ భాగం పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉంది. దీని విలువ 126 మిలియన్ డాలర్లు. ఎస్‌డపీ 100 సూచీలోని ఇతర కంపెనీలతో పోలిస్తే ఆల్ఫాబెట్ షేర్ హోల్డర్లకు లభించే రాబడి ఆధారంగా ఈ ప్యాకేజీ విలువ మారుతుంది. కంపెనీ పనితీరు లక్ష్యాలను అధిగమిస్తే, ఈ విలువ రెట్టింపు అయి 252 మిలియన్ డాలర్లకు చేరవచ్చు. ఒకవేళ లక్ష్యాలను అందుకోకపోతే దీని విలువ సున్నా కూడా కావొచ్చు. దీనికి అదనంగా సుందర్ పిచాయ్‌కు మూడేళ్ల కాలానికి 84 మిలియన్ డాలర్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్, వార్షిక వేతనంగా 2 మిలియన్లు అందనున్నాయి.

కంపెనీలోని అటానమస్ (స్వయంప్రతిపత్త) వెంచర్లైన వేమో, వింగ్ ఏవియేషన్ వృద్ధికి ఊతమిచ్చేలా ఆల్ఫాబెట్ కొత్తగా 350 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పిచాయ్‌కు వేమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్, వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల షేర్లు లభిస్తాయి. ఈ వెంచర్ల పనితీరు అద్భుతంగా ఉంటే ఈ స్టాక్స్ విలువ 200 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. డ్రైవర్‌లెస్ కార్లు, డెలివరీ డ్రోన్స్ వంటి క్లిష్టమైన రంగాలలో సుందర్ పిచాయ్ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఆల్ఫాబెట్ బోర్డు ఈ సందర్భంగా పేర్కొంది. 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు పెంచారు. అప్పట్లో 535 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ క్యాప్, ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 53 ఏళ్ల పిచాయ్ 2004లో గూగుల్‌లో చేరి క్రోమ్, ఆండ్రాయిడ్ వంటి కీలక విభాగాలను విజయవంతంగా నడిపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (96.5 మిలియన్ డాలర్లు), యాపిల్ సీఈఓ టిమ్ కుక్ (74.3 మిలియన్ డాలర్లు) వంటి వారి వార్షిక వేతనాలతో పోలిస్తే పిచాయ్ ప్యాకేజీ చాలా అధికం కావడం గమనార్హం.

# ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది.ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరఫున, ఇరాన్ ప్రజల తరఫున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

# కొత్తగా ఆలోచించే వారి కోసం 'క్రియేటివ్ సిటీ'

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

**అవకాశాల గనిగా భారత్**

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు 'రివర్స్ మైగ్రేషన్' మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జనాభా నిర్వహణపై డేంజర్ బెల్స్**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వృద్ధుల జనాభా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఏపీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన తాను, నేడు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, దీనిని కనీసం 2.1కి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త పాలసీని తీసుకొచ్చామని చెప్పారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలంతా జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు, నెలకు రూ.1000 అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో దేశానికి ఆస్తిగా ఉన్న పెద్ద కుటుంబాలు ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారిపోయాయని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ సహా 110 దేశాల నుంచి వచ్చిన 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, వ్యూహకర్తలు హాజరైన ఈ సదస్సులో చంద్రబాబు ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంతోనూ, పొరుగు రాష్ట్రాలతోనూ సమన్వయం చేసుకుంటూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం వివరించారు.

# భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- మొదటి పేజి తరువాయి

.గతేడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా 24 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. దీంతో భారతీయ కుబేరుల మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు (112.6 ట్రిలియన్లు) చేరింది. 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపద తగ్గడం లేదా స్థిరంగా ఉండటం గమనార్హం. ఈసారి సంప్రదాయ రంగాలకు మించి ఇతర రంగాల వారు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా హెల్త్‌కేర్ రంగం నుంచి 53 మంది, ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్జ్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా ఈ జాబితాలో చేరారు. అయితే తక్కువ మంది ఉన్నప్పటికీ, ఇంధన రంగం (ఎనర్జీ) అత్యధిక సంపదను కలిగి ఉంది. కేవలం 8 మంది బిలియనీర్లే రూ.18.3 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుల మొత్తం సంపదలో 16 శాతం వాటాను కలిగి ఉన్నారు. నగరాల వారీగా చూస్తే ముంబై 95 మంది బిలియనీర్లతో దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను మాత్రం ముంబై కోల్పోయింది. 133 మంది కుబేరులతో చైనాలోని షెన్‌జెన్ నగరం ఆసియాలో టాప్ ప్లేస్‌కు చేరింది. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు చేరగా, ఇది న్యూయార్క్ (14), లండన్ (9) కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక భారతీయ బిలియనీర్లలో మహిళల వాటా 7 శాతంగా ఉంది. మొత్తం 23 మంది మహిళా కుబేరుల వద్ద రూ.9.8 లక్షల కోట్ల సంపద ఉన్నట్లు హురున్ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు వయసు (65) కంటే భారతీయ బిలియనీర్ల సగటు వయసు (67) ఎక్కువగా ఉండటం గమనార్హం.

# హోర్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి...

- మొదటి పేజి తరువాయి

షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. భద్రతా కారణాల దృష్ట్యా హోర్ముజ్ జలసంధిలో రాకపోకలను నిషేధిస్తూ ఇరాన్ నేవీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే 'ప్రైమా' ట్యాంకర్ ఈ నిబంధనలను ఉల్లంఘించి ముందుకు సాగడంతో, ఐఆర్‌జీసీ డ్రోన్ ద్వారా ఆ నౌకపై దాడి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన తర్వాత, గత ఎనిమిది రోజులుగా హోర్ముజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి శత్రు దేశాలకు చెందిన లేదా వాటికి మద్దతు తెలిపే వాణిజ్య నౌకలను ఈ మార్గంలో అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు వస్తున్న వార్తలను ఇరాన్ ప్రభుత్వం ఖండించింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే నౌకల రాకపోకలు జరుగుతున్నాయని, జలసంధిని పూర్తిగా మూసివేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే తెలిపారు. కానీ, యుద్ధ సమయంలో జలసంధిని నియంత్రించే హక్కు తమకు ఉందని, అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు లేదా మారువేషంలో వచ్చే యుద్ధ నౌకలను మాత్రం సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం చేయడంతో ఈ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

# చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- మొదటి పేజి తరువాయి

డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిలింలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నారు.

**స్పెషల్ అవార్డులు:**

ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవి
ఏఎన్నార్ అవార్డు - జయసుధ
పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనిదత్

**ఫీచర్ ఫిల్మ్స్:**

ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం - దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం - ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో
ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ బాలనటుడు - మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ సహాయ నటుడు - శివాజీ
ఉత్తమ సహాయనటి - భూమిక (యూఫోరియా)
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ - తండేల్
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా - కోర్ట్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ డాక్యుమెంటరీ - యూనిటీ
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం - అనగనగా
ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ గాయని - సాహితీ (కన్నప్ప)
ఉత్తమ కథా రచయిత - గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్‌ప్లే - అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ లిరిసిస్ట్ - నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ - శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్).
ఉత్తమ సినీ గ్రంథం: ప్రభ (శూన్యం నుండి శిఖరాగ్రాలకు)
ఉత్తమ సినిమా విమర్శకుడు: హెచ్ రమేశ్ బాబు

# జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- మొదటి పేజి తరువాయి

లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- మొదటి పేజి తరువాయి

గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు సిట్ అధికారులు ఈ కేసులో దర్యాప్తును లోతుగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గను ఈ కేసులో రెండవ నిందితురాలిగా (ఏ-2) చేర్చారు. ఈ మేరకు సిట్ అధికారులు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసులు సమర్పించిన ఛార్జిషీట్‌ను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. లక్ష్మీ దుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాలు వెలువడిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం లక్ష్మీ దుర్గ ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- మొదటి పేజి తరువాయి

సమంజసమని ఆమె ప్రశ్నించారు. "చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

# మెడికల్ కాలేజీ కాన్వొకేషన్‌లో కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని

## వైద్య వృత్తిలో సంపాదన కంటే సేవ ముఖ్యమని పిలుపు







పెన్ పవర్, గుంటూరు, మార్చి 07: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన కాన్వొకేషన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్య పూర్తిచేసుకుని ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి, కుటుంబాలకు మరియు పండుగలకు దూరంగా ఉండి తమ లక్ష్యాన్ని సాధించారని మంత్రి పేర్కొన్నారు. ఈ రోజు వైద్యులుగా మారినందుకు ప్రతి విద్యార్థి గర్వపడాలని అన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, తెనాలిలో ఉన్నప్పుడు ప్రజలు డాక్టర్ దక్షిణామూర్తి గారి పేరు ఎంతో గౌరవంగా చెప్పుకునేవారని తెలిపారు. నిజమైన సేవ చేసే వైద్యులకు సమాజంలో అపారమైన గౌరవం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. వైద్య వృత్తిలో సంపాదన కంటే రోగులకు అందించే సేవ ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎక్కడైనా వైద్యుడి గొప్పతనం అతను రోగులకు చేసే సేవతోనే నిర్ణయించబడుతుందని అన్నారు. వైద్యులు తమతో పనిచేసే నర్సులు, సిబ్బంది కంటే ఎక్కువ సమయం రోగులతో గడపాలని సూచించారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ నైపుణ్యం వైద్య వృత్తిలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. సహ వైద్యులు మరియు సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉండాలని, దూరంగా ఉంటే అనవసరమైన విభేదాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. వైద్య రంగంలో పోటీ ఎంత ఉన్నా సరే, సరైన విషయ పరిజ్ఞానం ఉంటే ఎవరైనా తమ ప్రతిభను నిరూపించుకోగలరని మంత్రి అన్నారు. ఆసక్తికరమైన కేస్ స్టడీస్‌ను అధ్యయనం చేయడం ద్వారా వైద్యులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ప్రస్తుత కాలంలో కొత్తగా వస్తున్న ఔషధాలపై అవగాహన పెంచుకోవడం అవసరమని, ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అప్పులు మరియు ఈఎంఐల ఒత్తిడి వృత్తిపై ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. ప్రతి వ్యక్తికి ధనం మాత్రమే కాకుండా గౌరవం, సంతోషం, ఆత్మసంతృప్తి కూడా ముఖ్యమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ, జీఎంసీ విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# పసుమర్రు గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టండి. ఆటోనగర్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి : ప్రత్తిపాటి

- పసుమర్రు ప్రజల తాగునీటి అవసరాలకు బొప్పూడి లిఫ్ట్ నుంచి స్థానిక చెరువును నీటితో నింపండి.
- ఆటోనగర్ కార్మికులు లేవనెత్తిన సమస్యలు రోజుల వ్యవధిలో పరిష్కారం కావాలి.
- సంకురాత్రి పాడు గ్రామాభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి.
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మాజీమంత్రి ప్రత్తిపాటి.



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 07 : పసుమర్రు : ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం, వేసవిలో ఎదురయ్యే నీటిఎద్దడి దృష్ట్యా ఇప్పుడే గ్రామంలోని చెరువును నీటితో నింపాలని, బొప్పూడి లిఫ్ట్ నుంచి నీటిని తరలించేలా చూడాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు సూచించారు. శనివారం ఆయన తన నివాసంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పసుమర్రు గ్రామస్తులు ప్రత్తిపాటిని కలిసి గ్రామాభివృద్ధి, ఇతర సమస్యలు తెలియచేస్తూ వినతిపత్రం అందించారు. వారి వినతిని పరిశీలించిన ప్రత్తిపాటి.. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా గ్రామంలోని చెరువును వెంటనే నీటితో నింపాలని పంచాయతీ, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. సీఎస్సార్ నిధులతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.


ఆటోనగర్ సమస్యల్ని రోజుల వ్యవధిలో పరిష్కరించండి..

ఆటోనగర్ కార్మికులకు స్థానికంగా కేటాయించిన ప్లాట్లలో కొలతలు తేడాలున్నాయని, హద్దులు సరిగా లేనందున సమస్యలు వస్తున్నాయని, రెండో ఫేజ్ లో రోడ్లు , కాలువలు నిర్మించాల్సి ఉందని, నీటి అవసరాలకోసం బోర్లు వేయించాలని, ఆటోనగర్ ప్రవేశంలో ప్రత్యేక స్వాగతద్వారం (అర్చీ) నిర్మించాలని స్థానిక కార్మికులు ప్రత్తిపాటిని కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలియచేస్తూ వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన ప్రత్తిపాటి ప్లాట్ల హద్దుల సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని మండల సర్వేయర్ ప్రసాద్ కు సూచించారు, ఆటోనగర్ లో బోర్లు వేయాలని ఆసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల్ని కోరాకు. ప్రత్తిపాటి విజ్ఞప్తిపై వారు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే బోర్లు వేస్తామని చెప్పారు. ఆర్చీ నిర్మాణం.. రోడ్లు, కాలువల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి, స్థానిక మున్సిపాలిటీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావులకు సూచించారు. ఆటోనగర్ కార్మికులు చెప్పిన సమస్యలన్నీ రోజుల వ్యవధిలోనే పరిష్కారం కావాలన్నారు.

గతేడాది తలెత్తిన తాగునీటి సమస్యలు ఈ ఏడాది పునరావృతం కాకూడదు..

పట్టణ ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించిన ప్రత్తిపాటి.. చిన్నచిన్న సమస్యలను యంత్రాంగం అశ్రద్ధ చేయడం తగదని, మంచినీరు, రోడ్లు, పారిశుధ్య నిర్వహణా లోపాలు వంటి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టంచేశారు. మున్సిపల్ సిబ్బంది పట్టణ ప్రజల తాగునీటి సమస్యపై వెంటనే దృష్టి సారించాలని, గతేడాది తలెత్తిన నీటిసరఫరాలో ఏర్పడిన లోపాలు మరలా ఈ ఏడాది ఎక్కడా పునరావృతం కాకూడదని ప్రత్తిపాటి ఆదేశించారు. నాదెండ్ల మండలం సంకురాత్రి పాడు గ్రామంలో సీసీరోడ్లు, ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, శ్మశానికి వెళ్లే దారిలో వాగుపైన రూ.22 లక్షలతో నిర్మించే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ప్రత్తిపాటికి వినతిపత్రం అందించారు. గ్రామస్తులు చెప్పిన అభివృద్ధి అంశాలపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

# సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి : మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 07 : చిలకలూరిపేట: పట్టణ పరిధిలోని ప్రజలందరూ తమ పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు కోరారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, పన్నుల వసూళ్లపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 31వ తేదీలోగా ఇంటి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను మరియు ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లలో వేగం పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించి, నిర్దేశించిన గడువులోగా పన్నులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, పట్టణంలోని వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. మార్చి 31వ తేదీలోగా బకాయిలుచెల్లించాలి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పన్నులను త్వరితగతిన కట్టాలని సూచన, వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశం. ప్రజలు తమ బాధ్యతగా పన్నులు చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని, మొండి బకాయిదారులు కూడా వెంటనే చెల్లించాలని తెలిపారు.

# అన్ని నియోజకవర్గాల్లో మహిళా దినోత్సవాలు నిర్వహించాలి



పల్నాడు జిల్లా : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం అన్ని నియోజకవర్గాల్లో విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కోరారు. దీనికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై డిఆర్ఓ, ఆర్‌డిఓ, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్‌డిఏ, మెప్మా, ఐసిడిఎస్ పీడీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి మినిట్స్ తయారు చేయాలని, పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో 3 వేల మంది మహిళలు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. స్త్రీ శక్తి మహిళ యాప్, మహిళ పోలీస్, డిఆర్‌డిఏ, మెప్మా, సంక్షేమ శాఖలు, పరిశ్రమల శాఖ, పోలీస్, శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వైద్య శిబిరం నిర్వహించాలని చెప్పారు. ప్రత్యేకంగా మహిళలకు అందించే పథకాలకు సంబంధించిన వనరుల పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని ఎంపి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. మహిళ పారిశ్రామిక వేత్తలను సన్మానించడానికి, వారి విజయ గాథలను వారే వివరించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# సకాలంలో విధులకు హాజరు కావాలి

## జీఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు





స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, గుంటూరు, మార్చి 07: నగరపాలక సంస్థ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరై బాధ్యతాయుతంగా పనిచేయాలని జీఎంసీ కమిషనర్ కే మయూర్ అశోక్ సూచించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, ఆడిట్, అకౌంట్స్, ఎలక్షన్ సెల్, బర్త్ అండ్ డెత్ రిజిస్ట్రేషన్ విభాగాలు, సిటిజన్ చార్టర్, క్యాష్ కౌంటర్లు మరియు పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఉద్యోగుల పనితీరు, కార్యాలయ పరిశుభ్రత, పాత వస్తువుల తొలగింపు అంశాలపై మేనేజర్ బాలాజీ బాష, సంబంధిత సూపరింటెండెంట్లకు తగు సూచనలు చేశారు. ప్రతి విభాగంలో ఉద్యోగుల విధులు, కార్యాలయ సమయాలు, పర్యవేక్షణ అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా మార్చి నెల కావడంతో పన్నుల వసూళ్ల నేపథ్యంలో క్యాష్ కౌంటర్లలో సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు షిఫ్ట్‌ల ప్రకారం విధుల్లో ఉండేలా షెడ్యూల్ చేయాలని మేనేజర్‌ను సూచించారు. కార్యాలయ సమయాల్లో ఆఫీస్ పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యాలయాల్లో చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వినియోగంలో లేని పాత వస్తువులను వెంటనే తొలగించాలని సూచించారు. పాత బీరువాలు మరియు ఇతర సామగ్రిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని మేనేజర్‌ను ఆదేశించారు. ఇక నుంచి కార్యాలయంలోని విభాగాలను తరచుగా ఆకస్మికంగా తనిఖీ చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

# కిడ్నీ బాధితుడికి అండగా నిలిచిన మాజీమంత్రి

**20 రోజుల క్రితం తన దృష్టికి వచ్చిన సమస్యను సీఎంవో కార్యాలయ వర్గాల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం సాయం అందేలా చేసిన ప్రత్తిపాటి**

**ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.9 లక్షల ఎల్.వో.సీని కిడ్నీ వ్యాధిగ్రస్తుడు సాయి తల్లికి అందచేసిన ఎమ్మెల్యే**

**వైద్యచికిత్స అందిస్తున్న ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి, బాధితుడు కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని సూచించిన ప్రత్తిపాటి**



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 07 : చిలకలూరిపేట : పట్టణంలోని 6 వార్డు (ఎన్టీఆర్ కాలనీ)కి చెందిన కిడ్నీ బాధితుడు గుంటూరు సాయి అనారోగ్య సమస్యను అతని తల్లి, ఇతర కుటుంబసభ్యులు తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే ప్రభుత్వాన్ని సంప్రదించి, సీఎంవో కార్యాలయ సిబ్బందితో మాట్లాడటం జరిగిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బాధితుడి ఆరోగ్య సంరక్షణకోసం, నాణ్యమైన వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.9 లక్షల ఎల్. వో.సీ ని ప్రత్తిపాటి శనివారం సాయి తల్లి గుంటూరు రమాదేవికి అందించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, చిన్న వయసులోనే సాయి రెండు కిడ్నీలు దెబ్బతిని, మంచానికే పరిమితం కావడం బాధాకరమన్నారు. బాధితుడికి తండ్రి లేరని, తల్లి రెక్కల కష్టమే ఆ కుటుంబానికి ఆధారమని, ఈ పరిస్థితుల్లో వారికి అండగా నిలుస్తామని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. అలానే పురుషోత్తమపట్నం కు చెందిన కాటేరు లక్ష్మీ కు 2లక్షల రూపాయల ఎల్.వో.సి. నీ అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బత్తినేని శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : సివిల్ జడ్జి ఐ. స్వాతి




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 07 : చిలకలూరిపేట : నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి రాణించాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ. స్వాతి పిలుపునిచ్చారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో ఉన్న అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మహిళలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జడ్జి స్వాతి మాట్లాడుతూ, గతంలో మహిళల పట్ల సమాజంలో వివక్ష ఉండేదని గుర్తు చేశారు. ఒకప్పుడు ఆడపిల్ల పుట్టిందని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడే దుస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని ఆమె పేర్కొన్నారు. నేటి సమాజంలో ఆడపిల్లలు తమ ప్రతిభతో అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పురుషుల కంటే మహిళలే అన్ని రంగాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని జడ్జి స్వాతి ధీమా వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధికి దోహదపడే గొప్ప కార్యక్రమాల్లో మహిళలు క్రియాశీలక పాత్ర పోషిస్తారని ఆమె సూచించారు. మహిళలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు.

# విద్యార్థులకు పోలీసుల ఓపెన్ హౌస్



పల్నాడు జిల్లా : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: మహిళా దినోత్సవ వారోత్సవా లలో భాగంగా 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మహిళా భద్రత, అత్యవసర వ్యవస్థ, డయల్ 100/112, భద్రతా యాప్‌ల ఉపయోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసులు విధుల్లో ఉపయోగించే ఆధునిక ఆయుధాలు, తుపాకులు, పిస్టల్స్ గురించి, కమ్యూనికేషన్ పరికరాలు, సెఫ్టీ గాడ్జెట్‌లు, మిషనరీ గురించి ప్రాక్టికల్ డెమో ఇచ్చారు.

# రూ 6 లక్షలతో సి.సి డ్రైన్స్ ఏర్పాటుకు శంకుస్థాపన




భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 7: భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామం అంబేద్కర్ కాలనీలో రూ 6 లక్షల వ్యయంతో సిమెంట్ డ్రైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు పల్లికోన ఎంపీటీసీ దున్న తిరుపతి బాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటినుంచో అంబేద్కర్ కాలనీవాసులు మురుగు నీరు పారుదల లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని మాజీ మంత్రి,వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకు వెళ్ళటం జరిగిందన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆనందబాబు స్పందించి వెంటనే అక్కడ మురుగు నీటి సమస్య పరిష్కరించమని మండల పరిషత్ అధికారులకు సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ నిధుల నుండి దున్న తిరుపతి బాబు ద్వారా ఆరు లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. శనివారం 10:30 కు శంకుస్థాపన చేయడం జరిగిందనీ తిరుపతి బాబు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి టిడిపి పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ మండవ రామ కోటేశ్వరరావు,సొసైటీ డైరెక్టర్ వేజళ్ల సోమశేఖర్,రావూరి నవీన్,చిలుమూరి ఇస్సాకు,పార్టీ నాయకులు,ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

# దగ్ధమైన మోటారు సైకిల్

## ...నలుగురు నిందితులు అరెస్ట్

## ..14 రోజులు రిమాండ్.



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చ్,7: మోటారు సైకిల్ ను దగ్ధం చేసిన సంఘటనలో నలుగురు నిందితులైన యువకులను అరెస్టు చేసినట్లు భట్టిప్రోలు ఎస్ ఐ.ఎం శివయ్య శనివారం తెలిపారు. ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల రెండవ తేదీన మండల కేంద్రమైన భట్టిప్రోలు లో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వారి రథోత్సవం జరిగింది. రథోత్సవ సమయంలో పూర్తిగా మద్యం మత్తులో ఉన్న బట్టు లీలా సాయికుమార్ అనే యువకుడు,బందోబస్తు నిర్వహిస్తున్న భట్టిప్రోలు ఎస్ ఐ ఎం శివయ్య పై దురుసుగా ప్రవర్తించాడు. ఈ మేరకు ఆ యువకుడిని అదుపులోనికి తీసుకొని భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం అతని తల్లిదండ్రులు స్టేషన్ కు వచ్చి పోలీసులను సంప్రదించటంతో ప్రధమ తప్పుగా భావించిన స్టేషన్స్ సిబ్బంది,అతనిని తల్లిదండ్రుల పూచీకత్తుపై వదిలివేశారు. ఈ సందర్భాన్ని మనసులో పెట్టుకున్న ఆ యువకుడు అతని స్నేహితులైన ఆదిన గౌతమ్ సాయి,సిరి బోయిన శ్రీనివాసరావు,ఆదిన నాగ శ్రీనివాసరావుల తో కలసి ఎస్సై శివయ్య ఇంటిముందు నున్న స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణ కు సంబంధించిన ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇంటి సమీపంలో కేకలు మాటలు వినిపించడంతో హెడ్ కానిస్టేబుల్ కృష్ణ బయటకు రావడంతో నలుగురు యువకులు పరారయ్యారు. ఈ సంఘటనను పోలీసు సిబ్బంది ప్రతిష్టాత్మకంగా తీసుకొని సంఘటనకు కారకులైన నలుగురు నిందితులను శుక్రవారం సాయంత్రం ఓలేరు సమీపంలో 216 జాతీయ రహదారిపై సంచరిస్తున్న వీరిని అదుపులోనికి తీసుకు ని అరెస్టు చేశారు. ఈ మేరకు వారిని రేపల్లె కోర్టుకు తరలించి, న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. సంఘటనను తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి నలుగురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివయ్య మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# జంపని పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుక



వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్ మార్చి, 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వేమూరు మండలం జంపని గ్రామంలోని పీఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే బదరీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనముగా సన్మానం చేశారన్నారు. ఈ కార్యక్రమమునకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు బదరి నారాయణ మాట్లాడుతూ మన దేశములో మహిళలు అన్ని రంగాలలో ముందు వున్నారన్నారు. బాలికలు కూడా చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు నరసింహారావు, రాంబాబు,ప్రకాశం, పార్ధసారధి,ఎస్ఎంసి ఛైర్మన్ విజయబాబు పాల్గొన్నారు.

# బగళాముఖి క్షేత్రాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ శ్రీ కాలువ శ్రీనివాసులు.



పిట్టలవానిపాలెం పెన్ పవర్ న్యూస్. ప్రసిద్ధిగాంచిన సందోలు గ్రామాల్లో గల శ్రీ భగలాముఖి అమ్మవారి ఆలయానికి మాజీ మంత్రివర్యులు, రాయదుర్గం శాసనసభ్యులు శ్రీ కాలువ శ్రీనివాసులు సతీసమేతంగా అమ్మవారి ఆలయానికి విచ్చేశారు ఈ సందర్భంగా ప్రోటోకాల్ ప్రకారము మంగళ వాయిద్యములు వేద స్వస్తి పూర్ణకంభముతో స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణం జరిపించి శ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారికి వేద ఆశీర్వచనము చేయించి శాలువాతో సత్కరించి శ్రీ అమ్మవారి చిత్రపటం ప్రసాదములు ఇవ్వడం జరిగింది. అమ్మవారి సన్నిధిలో వారి గోత్రనామాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు అన్ని రకాలుగా రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధిగా పరిపాలించడానికి అమ్మవారి అనుగ్రహం కలగాలని ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనులకు పాడిపంటలతో తల తోటి తొలదూగి తుల తూగి నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం సత్వరం పూర్తిగాబడాలని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అమ్మవారి ని న్యాయానికి అతి దేవతగా ఏలయానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎన్వి రమణ దగ్గర నుండి ఎంతోమంది అనేక రాష్ట్రాల నుండి న్యాయమూర్తులు రావడం ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉందని ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారములు తను కూడా భాగస్వామిని అవుతానని తొలుతగా 10000 డొనేషన్ గా అమ్మవారికి సమర్పించాలని తెలియపరిచారుఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీ కలకోట చక్రధర్ రెడ్డి సభ్యులు కేతరాజు పట్టాభిరామారావు వక్కలగడ్డ ప్రసాదు, ఎన్నికపల్లి వెంకటప్పయ్య ఆలయ పూజారులు కుంచల నరసారెడ్డి కుంచెల గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారని ఆలయ ఈవో జి నరసింహమూర్తి తెలియపరిచారు.

# విజయవాడ లో విద్యార్థినిపై యాసిడ్ దాడి చేసిన ప్లే స్కూల్ ని సీజ్ చేసి నిందితులను కఠినంగాశిక్షించాలి: శివ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వినోదుల నరసింహారావు.



గుంటూరు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: గుంటూరు శివసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వినోదుల నరసింహ రావు మాట్లాడుతూ విజయవాడ లో మూడేళ్ల విద్యార్థినిపై యాసిడ్ దాడి చేసిన ప్లే స్కూల్ ని సీజ్ చేసి, చిన్నారిపట్ల కర్కశంగా ప్రవర్తిచ్చిన టీచర్ ని కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శివసేన పార్టీ నుండి వినోదుల నరసింహారావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మరియు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కి విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ప్లే స్కూల్ లో జరిగిన విషాద సంఘటన దారుణం అని అన్నారు. ఈ క్రమంలో విద్యార్థిని పై యాసిడ్ పోయటంతో గాయాలపాలై.. చిన్నారి బాత్రూమ్ కూడా వెళ్లలేని స్థితిలో ఉందని చిన్నారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. చికిత్స పొందుతోందని విద్యార్థిని కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర అధ్యక్షులు వినోదుల నరసింహారావు తీవ్ర దిగ్భ్రాంతికి గురియిన్నట్లు తెలిపారు . ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వము ఒ పోలీసులు కఠినంగా వ్యవహారించాలని ప్రభుత్యం ప్రత్యేకశీగా బాలికల రక్షణా విభాగాన్ని ఏర్పాటు చేయాలని వినోదుల నరసింహ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదరు విషయం పై పోలీస్ ఉన్నతాధికారులు , జిల్లా విద్యాశాఖ అధికారి బాలికల సంరక్షణ కమిషన్ వారు మహిళా కమిషన్ వారు ఏమి చర్యలు తీసుకున్నారో ప్రజలకి తెలిజేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

# 2026 ఛాంపియన్ షిప్ పోటీలకు పోస్టర్ల విడుదల




జగ్గయ్యపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: జగ్గయ్యపేట స్విమ్మింగ్ పూల్ నందు నిర్వహించే ఏ పి ఒ టీ జి స్టేట్స్ డి ఎస్ ఏ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ – 2026 పోటిల పోస్టర్లను జగ్గయ్యపేట గౌరవ శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య రాజగోపాల్ . మరియు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర రావు . ఆవిష్కరించారు,

# సైన్స్ సెమినార్ లో జిల్లా ప్రథమ స్థానం మరియు జాతీయ స్కాలర్షిప్ కు ఎంపికైన బ్రహ్మనాయుడు స్కూల్ విద్యార్థులు





పెన్ పవర్ కారంపూడి మర్చి 7:-- మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలో బ్రహ్మనాయుడు హై స్కూల్ విద్యార్థులు ప్రతి సంవత్సరం ఎన్ఎంఎంఎస్ ( నేషనల్ మీన్స్ కం స్కాలర్షిప్) టెస్ట్ కు బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కారంపూడి కి చెందిన ఎం యశస్విని లక్ష్మీబాయి 8వ తరగతి విద్యార్థిని అర్హత సాధించి 9వ తరగతి నుండి ప్రతి సంవత్సరము 12000 రూపాయలు తీసుకొనుటకు ఎంపిక అయినదని పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు ప్రసాద్ నాయక్ తెలిపారు. అలాగే నేషనల్ సైన్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని విజ్ఞాన్ వారోత్సవాలు నరసరావుపేట శంకర్భారతిపురం హై స్కూల్ నందు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించగా ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 25 మండలాలు పాల్గొనగా బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి యాసిన్ (6వ తరగతి)కు ప్రథమ స్థానం లభించిందని పాఠశాల సైన్స్ ఉపాధ్యాయి ని శివపార్వతి తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ శివ శేషిరెడ్డి, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ బాలునాయక్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# పిల్లల భద్రతకు సమాజం బాధ్యత వహించాలి..డా. పెమ్మసాని చంద్రశేఖర్..






పెన్ పవర్, గుంటూరు, మార్చి, 07. బాల బాలికల పై జరిగే నేరాల విషయంలో అవగాహన పెంచడం అత్యంత అవసరమని తెలిపారు. 2023 సంవత్సరానికి సంబంధించిన డేటా ప్రకారం దేశవ్యాప్తంగా దాదాపు 1.70 లక్షల కేసులు చిన్నపిల్లలపై నమోదయ్యాయని పేర్కొన్నారు. నమోదైన కేసుల్లో 45% అపహరణలు (కిడ్నాపింగ్), 38% పోక్సో కేసులు ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు సగటున 192 కేసులు బాలలపై లైంగిక నేరాలకు సంబంధించినవి నమోదవుతున్నాయని వెల్లడించారు. బాలలపై జరిగే నేరాల్లో 96% కేసుల్లో నేరస్తులు పిల్లలకు తెలిసిన వ్యక్తులే ఉంటారని చెప్పారు. చాలా సందర్భాల్లో బాధితులు భయం మరియు సామాజిక ఒత్తిడి కారణంగా ఫిర్యాదు చేయరని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నమోదయ్యే కేసుల్లో కేవలం 3% మాత్రమే అధికారికంగా రిపోర్ట్ అవుతున్నాయని తెలిపారు. చైల్డ్ లేబర్ సమస్య కూడా తీవ్రమైనదని, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 55% బాల కార్మికులు ఉన్నారని చెప్పారు. బాలలపై జరిగే నేరాలు వారి జీవితంపై దీర్ఘకాలిక మానసిక ప్రభావాలు చూపుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో బాలలపై నేరాలకు సంబంధించిన 1.93 లక్షల కేసులు పెండింగ్లో ఉన్నాయని వెల్లడించారు. కన్విక్షన్ రేటు కేవలం 32% మాత్రమే ఉండటం ఆందోళనకరమని తెలిపారు. చైల్డ్ అబ్యూస్ అనేది కేవలం పేద కుటుంబాల్లోనే జరుగుతుందని అనుకోవడం ఒక అపోహ అని చెప్పారు. బాలలపై లైంగిక నేరాల్లో అబ్బాయిలు కూడా గణనీయంగా బాధితులవుతున్నారని గుర్తు చేశారు. చైల్డ్ లేబర్ పిల్లల విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తును దెబ్బతీస్తుందని తెలిపారు. బాలలపై నేరాలు జరిగాయని తెలిసినా ఫిర్యాదు చేయకపోవడం కూడా చట్టపరంగా నేరమేనని స్పష్టం చేశారు. స్కూల్ స్థాయిలో యూనివర్సల్ స్క్రీనింగ్, హోమ్ విజిట్స్ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని చెప్పారు. చిన్నపిల్లలు తమ హక్కుల కోసం పోరాడలేరు కాబట్టి సమాజం వారి భద్రతకు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పిల్లలు సానుభూతి కోరుకోవడం కాదు, రక్షణ కోరుకుంటున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి , ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ , గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి , ఈస్ట్ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ , సూర్యకుమారి ,వేణుగోపాల్ రెడ్డి , సీనియర్ టెక్నికల్ ఎక్స్పర్ట్ ఆన్ హెల్త్, మెంటల్ హెల్త్ అండ్ స్కూల్ సేఫ్టీ ఆఫ్ చిల్డ్రన్ షైస్టా కె . షా , చైల్డ్ వెల్ఫేర్ విభాగం అధికారులు, స్పెషల్ జువెనైల్ పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, పేరెంట్ కమిటీ సభ్యులు మరియు పాఠశాలల నుండి వచ్చిన రీజినల్ జాయింట్ డైరెక్టర్లు పాల్గొన్నారు...

# యడ్లపాడు స్పిన్నింగ్ మిల్లుల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 07 : యడ్లపాడు : జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు శనివారం భారీ స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ముఖ్యంగా యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని 12 స్పిన్నింగ్ మిల్లులపై పోలీసులు ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్ కోసం ఇద్దరు డీఎస్పీల నేతృత్వంలో పోలీసులు 12 ప్రత్యేక బృందాలుగా విడిపోయి మిల్లుల్లోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం, మిల్లుల్లో పనిచేసే కార్మికులకు డ్రగ్స్ మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పోలీసులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. యువత మరియు కార్మికులు వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ, కార్మికులందరితో మత్తు పదార్థాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. అనుమానిత వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మహిళా ఉపాధ్యాయులను దుశ్శాలవలతో ఘనంగా సన్మానిస్తున్న జడ్పీ హెచ్ఎం సిలార్ అహమ్మద్, ఉపాధ్యాయులు ....

రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులకు సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతను ఇచ్చి వారిని గౌరవించినప్పుడే మంచి వ్యవస్థ ఏర్పడుతుందని ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్త్రీ మూర్తి అంటేనే మన దేశంలో కంటికి కనిపించే దైవంగా కొనియాడబడుతుందన్నారు. మహిళలను గౌరవించడం మన దేశ సంప్రధా యమని సమాజం అభివృద్ధిలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పుట్టిన ప్రతి శివువుకు తల్లి మొదటి గురువు అన్నారు. ఐక్యరాజ్య సమితి 2026 సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళారైతు సంవత్సరంగా ప్రకటించి మహిళల శక్తికి గుర్తింపు ఇవ్వడం. జరిగిందన్నారు. మంచికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో హెచ్ఎం సిలార్ ఆహమ్మద్ మాట్లాడుతూ మహిళలు ఎందులోను తీసిపోరని, ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాలలో రానిస్తున్నారన్నారు. ఆధునిక సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను దుశ్శాలవలతో ఘనంగా సన్మానించారు.

# ఇస్సపాలెంలో ఘనంగా ప్రారంభమైన మహంకాళి అమ్మవారి తిరునాళ్లు





నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామంలో మహంకాళి అమ్మవారి తిరునాళ్లు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ తిరునాళ్లకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆలయానికి విచ్చేసి మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, రవాణా వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే తిరునాళ్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సూచించారు. భక్తులు ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకునేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

# వలస కూలీల కడుపాకలి తీర్చిన జనచైతన్య సమితి.





పెదకూరపాడు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: పొట్టకూటికై వలస వచ్చి సమయానికి వసతులు లేక తిండి దొరికి దొరకక జీవనం సాగిస్తున్న వలస కూలీలకు జనసైతన సమితి అండగా నిలుస్తుంది. వండి వడ్డించడమే సహాయం కాదు మిగిలిన ఆహారాన్ని సేకరించడంలో కూడా బాధ్యత వహించి వలస కూలీలకు బాసటగా నిలిచి వారి ఆకలి ని తీరుస్తుంది. ఈ సందర్భంగా జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్ని బాబు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే సిద్ధాంతాన్ని నమ్మి ఈ సేవా కార్యక్రమాలు చేపట్టే అన్నారు. సందర్భంగా పరుచూరి పూర్ణ మాట్లాడుతూ బెన్ని బాబు తనకున్న దానిలో కొంత సమాజసేవకు ఉపయోగిస్తూ, నలుగురికి నీడ కల్పిస్తూ, వందల మంది ఆకలి తీరుస్తూ, మహిళలకు వృద్ధులకు గర్భిణీలకు సేవా కార్యక్రమాలు చేస్తూ ఆహారానందిస్తూ మనసున్న మారాజు అనిపించుకున్నారు. బుచ్చియపాలెం గ్రామంలో జరిగిన ఓ ఫంక్షన్ లో మిగిలిన ఆహారాన్ని సేకరించి శనివారం పల్స్ కూలీలకు విందు భోజనం అందించి వారి కళ్ళల్లో ఆనందాన్ని చవి చూశారు. కార్యక్రమంలో చెన్నంశెట్టి బాజీ, వెలుతోటి అనిల్, పరగటి రాజు సర్వేపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

# పట్టణంలో తాగునీటి కష్టాలు..

## పన్నులు వసూలు... సమస్యలపై మున్సిపాలిటీ నిర్లక్ష్యం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 07 : చిలకలూరిపేట : పట్టణంలో తాగునీటి సరఫరా తీవ్రంగా అస్తవ్యస్తంగా మారింది. ఒకవైపు ఉప్పునీరు, మరోవైపు కలుషిత నీరు కుళాయిల ద్వారా వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాగునీటి సమస్యలపై అధికారులు స్పందించకపోవడంపై పట్టణవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రజక కాలనీలో ఉప్పునీటి బాధలు

పట్టణంలోని రజక కాలనీ నివాసులు తీవ్రమైన తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు ప్రతి నెలా కుళాయిలకు నీటి పన్ను వసూలు చేస్తున్నప్పటికీ, కుళాయిల ద్వారా ఉప్పునీటిని సరఫరా చేస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

ఈ నీరు తాగడానికి మాత్రమే కాకుండా వంటకు, ఇతర గృహావసరాలకు కూడా పనికిరావడం లేదని వారు వాపోతున్నారు. ప్రజలకు శుద్ధమైన నీరు అందించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు సమస్యను పట్టించుకోకుండా కేవలం పన్నుల వసూలుపైనే దృష్టి పెట్టారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెహ్రూ నగర్‌లో కలుషిత నీరు

ఇక పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రాంతంలో గత పది రోజులుగా కుళాయిల ద్వారా రంగు మారిన కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఆకుపచ్చ రంగులో, మురికిగా వస్తున్న నీటిని చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఈ నీటిని ఉపయోగిస్తే కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం... లైన్ మెన్‌ల ఇష్టారాజ్యం

వార్డుల్లో ప్రజా సమస్యలను పర్యవేక్షించాల్సిన వార్డ్ ఎమెనిటీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో అధికారులు విఫలమవడంతో నీటి సరఫరా విషయంలో లైన్



మెన్‌ల ఇష్టారాజ్యం నడుస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా వార్డుల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. తక్షణమే మున్సిపాలిటీ ఉన్నతాధికారులు స్పందించి రజక కాలనీకి శుద్ధమైన తాగునీటిని అందించాలని, నెహ్రూ నగర్‌లో కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా నియమితులైన బత్తుల నానాజీ, కేబుల్ రాజుకు కంబాల అభినందనలు





గోకవరం పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: తూర్పు గోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం గోకవరం గ్రామానికి చెందిన బత్తుల నరసింహ రావు (నానాజీ), బరకటి అనిల్ కుమార్ (కేబుల్ రాజు )భారతీయ జనతాపార్టీ కాకినాడ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా నియమితులయ్యారు. వారిని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గురువారం రాత్రి గోకవరం సీఎండీ లే అవుట్ వద్ద శాలువాకప్పి,

పూలమాలలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. బత్తుల నానాజీ, కేబుల్ రాజులకు భారతీయ జనతా పార్టీలో ఈ అవకాశం కల్పించిన భారతీయ జనతా పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, రాజమండ్రి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మకి ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు ,


బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, దోసపాటి సుబ్బారావు, తాటికొండ సురేష్, సుజాత, దేశాల నరేష్, కందికట్ల మూర్తి, నెల్లి శ్రీను, అధిశేషు, త్రిమూర్తులు, గని రాజు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఉన్నత పాఠశాలలో నేడు మహిళా దినోత్సవ వేడుకలు



జగ్గయ్యపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: చైర్మన్, కమ్. -ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ, జగ్గయ్యపేట వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల స్కూల్,జగ్గయ్యపేట నండి ది 07.03.2026 నాడు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగినది. జడ్జి మాట్లాడుతూ మహిళా చట్టాలు మరియు సంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి లీగల్ సర్వీసెస్ ఎలా సహాయపడుతుందో క్లుప్తంగా తెలియచేసినారు. ఈ కార్యక్రమం నికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నీపాక సుందర్రావు వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరావు, జనరల్ సెక్రటరీ మెట్టెల ఆంజనేయులు మరియు మహిళా న్యాయ వాదులు యమ్.విజయ కుమారి, శోభా తోరనే మరియు శేషు కుమారి, హెడ్ మాస్టర్ హేమ మాధవి తదితరులు పాల్గొన్నారు. మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేసినారు

## మహిళా ఉపాధ్యాయులను దుశ్శాలవలతో ఘనంగా సన్మానిస్తున్న జడ్పీ హెచ్ఎం సిలార్ అహమ్మద్, ఉపాధ్యాయులు ....




రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులకు సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతను ఇచ్చి వారిని గౌరవించినప్పుడే మంచి వ్యవస్థ ఏర్పడుతుందని ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు.

# మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తిన కు పౌర సన్మానం.

## మహిళా దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన బత్తిన



గోకవరం పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన రామకృష్ణకు పౌర సన్మానం చేశారు. శుక్రవారం మానవ హక్కుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపాలెం లోని ఆర్ కన్వెన్షన్ హాల్ నందు మానవ హక్కుల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ బోడపాటి దాసు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ నిర్వహించారు ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షురాలు జి అర్చన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల ఫౌండేషన్ మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు ఏనుముల రుక్మిణి, అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డపాటి దాసు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎనుముల రుక్మిణి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యస్. శాంతి బాయి, ప్రముఖ సిద్ధాంతి తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి,న్యాయవాది టి. శోభ, ఎన్. టి. ఆర్. జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ జి అర్చన, ప్రముఖ గాయని యాంకర్ డాన్సర్ స్టేట్ బీకామ్. ఆర్డినేటర్ బి. ఉషారెడ్డి, కాకినాడ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ కె రాజమాణిక్యం,కోడి అబ్రహం,హౌహౌ రాజమండ్రి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఎం ఎస్ ఎస్ కుమారి,హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పశ్చిమగోదావరి ప్రధాన కార్యదర్శి కె.జయమణి,తూర్పుగోదావరి ప్రధాన కార్యదర్శి బి.సువర్ణవేణి, పశ్చిమగోదావరి అధ్యక్షురాలు డి.చండీరాణి లాంటి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన సుమారు వందమంది మహిళలను సన్మానించారు. అనంతరం మానవ హక్కుల ఫౌండేషన్ మహిళా విభాగపు ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బొడ్డపాటి దాస్ ను మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన రామకృష్ణను మానవ హక్కుల ఫౌండేషన్ లో ఉన్న మహిళలంతా సాలువా కప్పి పూలమాల పూలమాల వేసి కిరీటం పెట్టి పౌర సన్మానం చేశారు.

# పుష్పాలతో అలంకరింపబడిన శ్రీ వేంకటేశ్వరస్వామి..

## శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణం... కమనీయం...





రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:మండల కేంద్రమైన రెంటచింతలలోని సుబ్బన్నతోటలో వేంచేసియున్న అలివేలుమంగాపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామిఆలయ 22 వ వార్షికోత్సవ వేడుకలు అలాగే స్వామివారి కళ్యాణంనేత్రపర్వంగాజరిగింది. పచ్చని తోరణా లతో అలంకరించిన కళ్యాణవేదిక సన్నాయి వాయిద్యాలు మేళతాళాలు పండితుల మంత్రోచ్ఛరణల నడును కలియు గమైనమైన శ్రీ వెంకటేశ్వరుని కళ్యాణతంతును అర్చకులు శర్మ చంద్రశేఖర్లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై కళ్యాణ వేడుకను తిలకించారు. తలంబ్రాలు పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ పెదబాబు దంపతులు సమర్పించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చున్నారు. స్వామి వారిఎదుర్కోళ్లను ఘనంగా జరిపారు. కళ్యాణం అనంతరం గా అన్నదానం చేపట్టారు .రాత్రి వేళ స్వామివార్లను పురవీధుల్లో ఊరేగించారు. 9 కేజీలు బరువుండే(బంగారు లాకెట్తో సహా) లడ్డూనుగానుగపంటశ్రీనివాసరెడ్డి రూ. 23 వేలకు పాడుకున్నారు.

# అంబరాన్ని తాకిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలుస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా పేర్కొన్నారు. శనివారం నల్లచెరువులోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల మరియు ఎస్టియు గుంటూరు నగర పశ్చిమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ సలీం బాష వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారు చూపుతున్న అంకితభావం అభినందనీయమనికొనియాడారు. కార్యక్రమం లో భాగంగా విద్యా మరియు



సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన 40 మందికి పైగా ఉపాధ్యాయులను, మహిళలను డీఈఓ చేతుల మీదుగా శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. పాల్గొని నలభైమందికి ? ఈ వేడుకల్లో గౌరవ అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పెదబాబు మరియు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కొరివి విజయబాబు మాట్లాడుతూ మహిళా సాధికారత కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, ఆచరణలో వారికిసమాన అవకాశాలుకల్పించినప్పుడేనిజమైనఅభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు.

# పొలంబడి కార్యక్రమం పై శనగ పంట రైతులు



ఫిరంగిపురం : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: మండల పరిధిలోని మెరికపూడి గ్రామంలో శుక్రవారం చనగ పంట పై పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి జై వాసంతి హాజరయ్యారు. శనగ పంట వేసిన రైతులందరూ 14% తేమ వరకు తమ పంటను ఎండలో ఆరబెట్టుకొని ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో గల కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ 5875 లకు మాత్రమే అనుకోవచ్చు తెలియజేశారు. అదేవిధంగా శనగ పంట వేసిన ప్రతి రైతు తమ పంటలను నమోదు చేసుకున్న తర్వాత రైతు సేవా కేంద్రంలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంట ఇచ్చిన తేదీ లోగా ప్రభుత్వం వారికి మాత్రమే అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వి మల్లిక మరియు బెల్లంకొండ హకీములు పాల్గొన్నారు..

## పాతాళ్లపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడివో ఐజాక్ ప్రవీణ్




నెల్లూరు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:అనంతసాగరం ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ మరియు జిఎస్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో షానవాజ్ పాతాళపల్లి సచివాలయాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పరిశీలించడమైనది. ఏకీకృత కుటుంబ సర్వే నూరు శాతం పూర్తి చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించడం అయినది. ఇంటి పన్ను వసూలు పై సమీక్ష నిర్వహించారు. పాతాళపల్లి పంచాయతీ పరిధిలో 1,86,000 రూపాయలు వసూలు చేయవలసి ఉండగా ఇప్పటివరకు లక్ష 25 వేల రూపాయలు వసూలు చేయగలిగినట్లు ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. ఇంకను మిగిలిన 60 వేల రూపాయలను త్వరగా వసూలు చేసి నూరు శాతం వసూలు పూర్తి చేయవలసినదిగా సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఫంక్షనరీ షాహుల్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాల్ మనీ వివాదాలపై స్వయంగా అవగాహన కల్పిస్తున్న డిఎస్పీ మురళీకృష్ణ



మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: రెండు రోజుల క్రితం కోనేటి నాగేశ్వరరావు అనే ఓ దళిత యువకుడు పై దాడి చేసిన వడ్డీ వ్యాపారి సందు నాగేశ్వరరావు. ఈ కేసు విచారణ నిమిత్తం ఉండవల్లి గ్రామంలోని కోనేటి నాగేశ్వరరావు ఇంటికి స్వయంగా వచ్చి విచారణ చేపట్టిన డి.ఎస్.పి మురళీ కృష్ణ.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మచ్చల జింక మృతి



కోవూరు : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: ఆహారం కోసం జనావాసాల వైపు వస్తూ గుర్తు తెలియని వాహనం రూపంలో వచ్చిన మృత్యువుకు అడవి జంతువు బలైంది. ఈ విషాదకర ఘటన శనివారం నెల్లూరు జిల్లా కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. గంగవరం కాలువ బాంబే హైవే సమీపంలో మచ్చల జింక రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు బలంగా ఢకట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జింక అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. రక్తపు మడుగులో పడి ఉన్న జింకను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని మూగజీవి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## మార్చి 8 న మహిళా దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఎకో పార్క్ లో ట్రెక్కింగ్ ఫెస్టివల్.




మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: ఈ నెల 8 వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి ఎకో పార్కులో ట్రెక్కింగ్ ఫెస్టివల్ ను నిర్వహించనున్నట్లు వీ వైబ్ ఈవెంట్స్ ఫౌండర్ రాగవీణ తెలిపారు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఏపీ ల సహకారం తో ఈవెంట్ నిర్వహణ జరగనున్నదని, ఈ ట్రెక్కింగ్ ఫెస్టివల్ లో 350 మంది పాల్గొననున్నారని, 8 వ తేదీ ఉదయం 6 గంటలకు యోగ కార్యక్రమం తో కార్యక్రమం మొదలు కానుందని,కార్యక్రమం అనంతరం పాల్గొన్నవారికి మెడల్స్, సర్టిఫికెట్ ప్రధానోత్సవ కార్యక్రమం అతిధుల చేతుల మీదగా జరగనున్నదని రాగవీణ తెలిపారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ను కలిసిన ఆల్విన్ కాలనీ వాసులు


శేరిలింగంపల్లి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు, కాలనీ వాసులు శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నేతలు ప్రదీప్ రెడ్డి, కృష్ణ గౌడ్‌లు కాలనీలో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## కంబాల ఆధ్వర్యంలో ఘనంగా లక్ష్మి గణపతి హోమం.



గోకవరం పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:: సంకష్టహర చతుర్థి పర్వదినం సందర్భంగా స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పద్మావతి దేవి గంగారత్నం దంపతులచే అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాధరావు శర్మ లక్ష్మీ గణపతి హోమాన్ని, గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖ, సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఏటా పాడి పంటలు బాగా పండాలని, అన్నదాతలు, వ్యాపారస్తులు, కార్మికులు, కర్షకులు, అన్ని రంగాల వారు, ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో ప్రతి నెల లోక కళ్యాణార్థం లక్ష్మి గణపతి హోమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, రామసేన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో తుది ఓటర్ల జాబితాను చేయాలి



నరసరావుపేట: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి తుది ఓటరు జాబితా చేయాలి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జిల్లాలోని డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోర్టల్ నందు అప్డేట్ చేయాలనీ ఆదేశించారు. శుక్రవారం ఉదయం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల లాగిన్ల నందు ముందుగా 2011 జనాభా ను నమోదు చేయాలనీ, తదుపరి గ్రామపంచాయితీల వారీగా పోలింగ్ స్టేషన్ల జాబితా నమోదు చేయాలనీ, గ్రామపంచాయితీల వార్డుల వారీగా ప్రింట్ తీసుకోవాలని, డోర్ నంబర్ తప్పుగా ఉన్న యెడల వారి యొక్క యదాస్థానానికి చేర్చాలని తదుపరి ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రింట్ తీసుకుని తేది.07.03.2026 గ్రామస్థాయిలో ప్రక్రియ పూర్తి చేసి 09.03.2026 పల్నాడు జిల్లా లో ఉన్న గ్రామపంచాయితీలనశీదు వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితా ప్రచురించలని తెలిపారు. ఈ క్రమంలో చేపట్టిన మీటింగ్ నందు జిల్లా గ్రామపంచాయితీ అధికారి యస్.వి.నాగేశ్వర్ నాయక్, సత్తెనపల్లి, గురజాల, నరసరావుపేట డివిజనల్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయితీ అధికారి నరసరావుపేట వారు, మరియు జిల్లా లోని అందరు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు....

## కానగల పెంచలమ్మ 2026 అంతర్జాతీయ నారీ సేవా శిరోమణి అవార్డుకు ఎంపిక డాక్టర్ మల్లెపూల వెంకట రమణ






నెల్లూరు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం పాతాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆగ్నేష్ స్వచ్ఛంద సేవ సంఘం సభ్యురాలు కానగల పెంచలమ్మ కు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2026 అంతర్జాతీయ నారీ సేవా శిరోమణి అవార్డు కు ఎన్నికైనట్లు హైదరాబాద్ కు చెందిన ప్రముఖ సామాజిక వేత్త, అమ్మ అనాధాశ్రమం ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మరియు బిజెపి సాంస్కృతిక సెల్ కన్వీనర్ అయిన డాక్టర్ మల్లెపూల వెంకట రమణ తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలలో ఉత్తమ సేవలు అందిస్తూన్న మహిళా మణులకు మా అమ్మ అనాధాశ్రమం ట్రస్ట్ ద్వారా 2026-అంతర్జాతీయ నారీ సేవా శిరోమణి అవార్డు ను అందిస్తూన్నాము. అందులో భాగంగా నెల్లూరు జిల్లా కు

చెందిన కానగల పెంచలమ్మ కు మార్చి నెల 29 వ తేదిన హైదరాబాద్ మహా నగరం లో ప్రముఖ సినీ నటుల చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.

## ప్రతిష్టాత్మకంగా 16వ జన గణన ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్






నరసరావుపేట: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పిలుపునిచ్చారు. నరసరావుపేట లోనిఎం ఏ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మొదటి దశ 'గృహాల జాబితా మరియు గృహ వసతుల గణన' శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించి, శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి కృతిక శుక్లా మాట్లాడుతూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మార్చి06 నుండి 08 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ శిక్షణలో జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. "మన గణన – – మన భవిష్యత్తు" అనే నినాదంతో జరుగుతున్న ఈ మహా యజ్ఞం దేశ ప్రగతికి దిక్సూచి వంటిదని, సేకరించే ప్రతి అంకె అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది అని స్పష్టం చేశారు. గృహ నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, ఇంటర్నెట్ వంటి 33 కీలక అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉంటుందని,సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం చట్టరీత్యా బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణ ప్రియా,జిల్లా రెవెన్యూ అధికారి నారదముని ,ఆర్డీవోమురళికృష్ణసంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు...

## ఆయిల్ మిల్లులపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు







నరసరావుపేట: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:: పట్టణ పరిధిలోని ఆయిల్ మిల్లులపై విజిలెన్స్ మరియు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆయిల్ మిల్లులు మరియు గోదాముల్లో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మరియు ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులతో సంయుక్తంగా ఆయిల్ మిల్లులపై అకస్మిక తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పదంగా విక్రయిస్తున్న ఆయిల్ ప్యాకెట్స్ లను, నూనె నమూనాలను (సాంపిల్స్) అధికారులు సేకరించారు.ప్రభుత్వ అధికారులు చేపట్టిన దాడులతో కొన్ని మిల్లుల యజమానులు తమ మిల్లులకు తాళాలు వేసి వెళ్లిపోయినట్లు సమాచారం. విజిలెన్స్ అధికారులు సేకరించిన నమూనాలను పరీక్షల కోసం సంబంధిత ప్రయోగశాలకు పంపనున్నట్లు తెలిపారు.

## సచివాలయానికి తాళం

నరసాపురం పెన్ పవర్ ప్రతినిధి మార్చి 07:"అధికారులు సహకరించడం లేదు.. కనీసం గౌరవం ఇవ్వడం లేదు.. ఇప్పటివరకు గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేయడం లేదు..ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదు.. విసిగిపోయి చివరికి సచివాలయానికి తాళం వేయక తప్పలేదు.." అని నరసాపురం మండలం పసలదీవి సర్పంచ్ కొట్టు రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం గ్రామ కార్యదర్శి, సిబ్బందికి పంచాయతీకి వచ్చే సమయానికి కంటే ముందుగా కార్యాలయం వద్దకు వెళ్లారు. తాళం వేసి తలుపు వద్ద ధర్నా చేపట్టారు.

# అంతా ఫీల్ గుడ్ కాదా..

**విజయవాడ, మార్చి 7, పెన్ పవర్:** కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ వివాదాలకు ఎట్టకేలకు తెరపడింది. కొలికపూడితో మంతెన సత్యనారాయణ రాజు భేటీ అయి, పార్టీలో దీనిపై ఉన్న సీరియస్ నెస్, రాజకీయంగా కలిగే నష్టాలను చర్చించారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి మధ్య కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించారు. అనంతరం ఈ వివాదాలపై తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్పందించారు. తిరువూరులో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలన్నీ ముగిసినట్లేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పరిణామాలు పార్టీ ప్రతిష్టకు ఏవైనా ఇబ్బందులు కలిగించి ఉంటే తాను చింతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు మళ్లీ రిపీట్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.అధికార ప్రోటోకాల్, పరస్పర గౌరవం గురించి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఖచ్చితంగా ఇస్తానని, అదే సమయంలో ఆయన నుంచి కూడా తాను అదే గౌరవాన్ని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన ప్రాణాలకు ముప్పు ఉందని గురువారం ఆరోపించారు. నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణోత్సవం సందర్భంగా జరిగిన ఘటనను ఉటంకిస్తూ, తనపై దాడి చేసి చంపేందుకు పక్కా ప్రణాళిక జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ కార్యాలయం నుంచే మధ్యాహ్నం నుండి జనాన్ని సమీకరించాలని ఆదేశాలు వెళ్లాయని, తనను లక్ష్యంగా చేసుకుని ఈ కుట్ర పన్నారని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ అధిష్టానం స్పందించింది. ఇది వ్యక్తిగతంగానే కాదు, పార్టీకి నష్టం కలిగిస్తుందని.. విభేదాలు మంచిది కాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగం తీరుపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిఘా వర్గాల ద్వారా తన గన్ మెన్‌కు ముందస్తు హెచ్చరికలు అందినప్పటికీ, తనకు కనీసం ఒక అదనపు కానిస్టేబుల్‌ను కూడా భద్రతగా కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. నెమలి వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణం సమయంలో కరెంట్ తీసివేసి చీకట్లో తనపై దాడి చేయాలని ప్లాన్ చేశారని, అయితే పోలీసులు అందుకు నిరాకరించడం వల్ల ప్రమాదం తప్పిందని తనకు సమాచారం ఉందని ఆయన వెల్లడించారు.తన కారు అద్దాలు పగలగొట్టి, టైర్ల గాలి తీసి తనను అడ్డుకుని భౌతిక దాడి చేయాలని చూశారనే స్పష్టమైన ఆధారాలు తన వద్ద ఉన్నాయని కొలికపూడి శ్రీనివాసరావు మీడియాతో చెప్పారు. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే అయ్యుండి కూడా తనకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు తిరువూరు నియోజకవర్గంలో రాజకీయ ఉత్కంఠను మరింత పెంచాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## విజయవాడ విద్యాధరాపురం లో దారుణం

### మూడు సంవత్సరాల పాప పై యాసిడ్ పోసిన స్కూల్ టీచర్

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**విజయవాడ: పెన్ పవర్:** విజయవాడ విద్యాదారపురం నేషనల్ ప్లే స్కూల్ లో టీచర్ చేసిన నిర్వాకం ఆలస్యంగా బయటపడింది. ఫిబ్రవరి 23 వ తారీకు పాపను నేషనల్ స్కూల్ దగ్గరపాపను తల్లి దింపింది. కాసేపటికి స్కూల్ నుంచి పాప బాతురూమ్ లో పడిపోయింది అని తల్లి కి ఫోన్ వచ్చింది. వెంటనే పాప తల్లి, అక్క స్కూల్ కి వచ్చి ఏడుస్తూ ఉన్న పాపని హాస్పిటల్ కి తీసుకువెళ్లారు . పాపను హాస్పిటల్ కు తీసుకువెళ్తే నిజాలు బయటపడ్డాయి. తల్లిదండ్రులు స్కూల్ దగ్గర కు వెళ్లి స్కూల్ యజమానాన్ని గట్టిగా అడుగగా నిజం స్కూల్ యాజమాన్యం ఒప్పుకుంది. హాస్పిటల్ లో బిల్లు కట్టి చేతులు దులుకుకుంది. తరువాత కొంత డబ్బులు ఇచ్చి రాజీకి రమ్మని స్కూల్ యాజమాన్యం చెప్పింది. తల్లిదండ్రులు ఒప్పుకోవకపోవడం తో బెదిరింపులకు దిగింది. ఈ విషయాలు బయటకు చెప్తే మీ అంతుచస్తాను అంటూ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు వార్నింగ్ ఇచ్చారు. డీసీపీ తమ చుట్టం అంటూ తల్లిదండ్రులకు బెదిరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కూతురిపై ఇంత కూరాత్మకంగా గాయపరిచిన వారిని శిక్షించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

## గ్యాస్ ధరల పెంపు

**న్యూఢిల్లీ: పెన్ పవర్:** అమెరికా ఇరాన్ యుద్ధం ప్రభావం మన దేశంపై ప్రభావం గట్టిగానే పడుతోంది. అంతర్జాతీయంగా ముడిచమురు రవాణాకు ఆటంకం ఏర్పాడిన నేపథ్యంలో దేశంలో చమురు ధరల పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది.. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తక్షణం కొత్త రెట్లు అమలులోకి రానున్నాయి. కమర్షియల్ సిలిండర్ ధర రూ.115, వంట గ్యాస్ ధర రూ.60 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించింది. హైదరాబాద్ లో వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపు తర్వాత రూ.965 గా ఉంటుంది. ఉజ్వల స్కీమ్ సిలిండర్ ధర విషయంలో ఎలాంటి మార్పు ఉండదని కేంద్రం తెలిపింది. పెట్రోల్ డీజిల్ ఇతర గ్యాస్ ధరలు కూడా పెరిగే అవకాశముంది.. దేశంలో చమురు నిల్వలు ఇరవై రోజుల్లో అడుగంటే పరిస్థితి ఉందని సమాచారం.

## కమలం చేతికి బీహార్..

**పాట్నా, మార్చి 7, పెన్ పవర్:** బిహార్‌లో రాత్రికి రాత్రి రాజకీయం మారిపోయింది. పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకరారం చేసి 21 ఏళ్లుగా బిహార్‌కు దశ దిశ నిర్దేశించిన నితీశ్‌కుమార్ రాజకీయం రాష్ట్రంలో ముగిసింది. రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మార్చి 5న నామినేషన్ వేశారు. నితీశ్‌కుమార్ ఢిల్లీ రాజకీయాలకు వెళ్లనున్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు అన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రిగా ఆయన పూర్తికాలం ఉంటారని ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ 5వ తేదీన నితీశ్‌కుమార్ ట్విట్టర్‌లో ఒక పోస్టు పెట్టారు. రాజ్యసభకు నామినేసన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు.మార్చి 4న వన్ ఆన్ మాల్ భవనంలో జరిగిన కీలక సమావేశం నితీశ్ నిర్ణయానికి మూలం. కేంద్ర మంత్రులు సంజయ్ ఝా, రామ్‌నాథ్ ఠాకూర్, విజయ్ కుమార్ చౌహాన్, బిజేంద్ర యాదవ్ పాల్గొన్నారు; అమిత్ షా ఫోన్‌లో చేరి ఆరోగ్యం, పరిపాలనా సవాళ్లపై చర్చించారు. ఇటీవల ఆయన వ్యవహార శైలి మార్పు, మతి సమస్యల ప్రచారం, ఐఏఎస్ అధికారుల ప్రభావం ప్రజల్లో అసంతృప్తి తెచ్చాయి. మార్చి 5న ఎక్స్ పోస్ట్‌లో రాజ్యసభ ప్రయాణాన్ని ప్రకటించారు.నితీశ్ కుమారుడు 40 ఏళ్ల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ నిశాంత్ కుమార్‌ను ఉపముఖ్యమంత్రిగా చేసి పార్టీ ఐక్యత కాపాడాలని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ అనుభవం లేనప్పటికీ, తండ్రి వెంట తిరుగుతూ క్రమంగా ప్రజాధరణ సంపాదించాలని ప్రణాళిక. కుటుంబ పాలనకు వ్యతిరేకత ఉన్నా, పార్టీ స్థిరత్వం కోసం ఈ దీర్ఘకాల ప్రణాళిక రూపొందుతోంది. జేడీయూ శ్రేణులు నిశాంత్ ప్రజాధరణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇక బీజేపీ ఖాతాలో మరో రాష్ట్రం రాబోతోంది. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి (నితీశ్ సమాజిక వర్గనేత), నిత్యానంద రాయ్ యాదవ్, దిలీప్ సైస్వాల్, విజయ్ కుమార్ సిన్హా సీఎం అవకాశాల్లో ముందున్నారు. బీజేపీ ఆధారంతో జేడీయూ మద్దతు ప్రభుత్వ ఏర్పాటుకు దారితీస్తుంది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఇది నితీశ్ స్వచ్ఛంద నిర్ణయమని, భవిష్యత్ ప్రభుత్వానికి ఆయన మార్గదర్శకత్వం ఉంటుందని తెలిపారు. రాజ్యసభ స్థానం జేడీయూ ప్రభావాన్ని కొనసాగిస్తుందని ఆశ.అసెంబ్లీలో 249 స్థానాల్లో బీజేపీ 89, జేడీయూ 86, రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ 19, ఆర్ఎల్‌జేపీ 4 సాధించాయి. ఆర్ఎల్‌జేపీ బీజేపీలో విలీనం ప్రణాళిక ఆర్‌జేడీ చీల్చే అవకాశాన్ని అడ్డుకుంటుంది. ఈ మలుపుతో బీజేపీ మరో రాష్ట్రంలో సీఎం పదవి సాధించనుంది. రోహిణి ఆచార్యలు నితీశ్‌ను బీజేపీ 'కీలుబొమ్మ'గా విమర్శిస్తూ, మిత్రద్రోహానికి మూల్యం చెల్లించారని ఆరోపించారు. ఈ పరిణామం బీజేపీ బలోపేతానికి జేడీయూ బలహీనతకు దారితీస్తోంది.

## 14 దేశాలకు పాకిన యుద్ధం

**న్యూయార్క్, మార్చి 7, పెన్ పవర్:** మిడిల్ ఈస్ట్‌లో అమెరికా పెట్టిన చిచ్చు క్రమంగా రగులుతోంది. మొదట ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులతో యుద్ధమ మొదలైంది. తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా మట్టుబెట్టడంతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. అయితే ఈ దాడులు ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా బేస్‌లు ఉన్న గల్ఫ్ దేశాలపై వైమానికి దాడులు చేసింది. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, ఓమన్, టర్కీ తదితర దేశాలపై ఇరాన్ మిస్సైల్ దాడులు చేస్తోంది. యుద్ధం ప్రారంభించి ఏడు రోజులైంది. మూడు దేశాలతో మొదలైన యుద్ధం ఇప్పుడు 14 దేశాలకు విస్తరించింది. ఇప్పుడు ఇరాక్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, ఖతర్, జోర్డాన్, అజర్‌బైజాన్, ఒమాన్, సౌదీ అరేబియా, లెబనాన్, సైప్రస్ వంటి 14 దేశాలను యుద్ధం చుట్టుముట్టింది.చర్చలు లేకపోవడంతో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. రష్యాఉక్రెయిన్ యుద్ధంలాగా ఈ ఘర్షణ కూడా సంవత్సరాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం విస్తరించేందుకు అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తుంది. మరోవైపు అమెరికాఇజ్రాయెల్ ఇరాన్‌ను వీలైనంత త్వరగా కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌కు ప్రాక్సీ దళాలు (హిజ్బుల్లా, హౌతీలు) దీర్ఘకాల పోరాటానికి అనుకూలం. అమెరికా, ఇజ్రాయెల్ ఆధునిక ఆయుధాలతో పైచేయి సాధిస్తున్నా, ప్రాంతీయ మద్దతు బలహీనత కలిగిస్తోంది. చైనా కూడా ఇరాన్ సార్వభౌమాధికారం కాపాడతామని ప్రకటించింది. దీంతో చైనా కూడా యుద్ధ రంగంలోకి దిగే అవకాశాలు ఉత్కంఠ రేపుతున్నాయి.ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న రష్యా, వాణిజ్య భాగస్వామి చైనా రంగంలోకి దిగితే పరిస్థితి ప్రపంచ యుద్ధ స్థాయికి చేరుకుంటుంది. రష్యా డ్రోన్‌లు, మిస్సైల్ సాంకేతికత ఇచ్చి ఉక్రెయిన్ మోడల్‌ను పునరావృతం చేయవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిడి, ఓసియాన్ మార్గాల్లో జోక్యం చేస్తే అమెరికా శక్తి విభజన అవుతుంది. ఇది నాటో, అరబ్ మిత్రుల మధ్య వైరుధ్యాలను పెంచుతుంది.తక్షణ శాంతి ఒప్పందాలు లేకపోతే యుద్ధం రెండేళ్లు కొనసాగవచ్చు. ఐరోపా, ఐక్యరాష్ట్ర సమితి మధ్యవర్తిత్వం జరిగితే మాత్రమే మొదటి దశలో ఆగిపోతుంది. ఆర్థిక సంక్షోభాలు, ఆంతరిక అశాంతి ద్వారా కూడా యుద్ధం ఆగే అవకాశం ఉంది. అయితే, ప్రాంతీయ అస్థిరత భవిష్యత్ దశాబ్దాల్లో కొనసాగుతుంది.

# ఏపీ లిక్కర్ స్కామ్

### 3500 కోట్ల నష్టం..440 కోట్ల జప్తు



**విజయవాడ, మార్చి 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలు, బూనేటి చాణక్య, వాసుదేవ రెడ్డి బంధువులు, ఇతర వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రకారం స్వాధీనం చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల్లో బ్యాంకు నిల్వలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మద్యం విధానంలో అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4,000 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.2019కి ముందు రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా నడిచేది. కొనుగోలు నుంచి విక్రయాల వరకు ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రిటైల్ మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సమయంలో ఆటోమేటెడ్ వ్యవస్థను నిలిపివేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేసినట్టు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. దీంతో సరఫరా ఆర్డర్లు జారీ చేసే విషయంలో అధికారులకు విస్తృత స్వేచ్ఛ లభించిందని ఈడీ తెలిపింది.మాన్యువల్ విధానాన్ని ఉపయోగించి మార్కెట్‌లో ఉన్న కొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్లను పక్కన పెట్టారని దర్యాప్తులో తేలింది. అదే సమయంలో కొందరు ఇష్టమైన బ్రాండ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సరఫరా ఆర్డర్లు మంజూరు చేసినట్టు వెల్లడైంది. అదే పేర్లతో పోలి ఉండే కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి వాటి ధరలను కృత్రిమంగా పెంచారని ఈడీ పేర్కొంది. దీంతో డిస్టిలరీలకు అధిక లాభాలు వచ్చి అవి లంచాల రూపంలో తిరిగి సిండికేట్ సభ్యులకు చేరినట్టు వెల్లడయింది.సరఫరా ఆర్డర్లు పొందేందుకు డిస్టిలరీలు ఒక్కో కేసు ధరలో 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్‌లు చెల్లించాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలింది. చెల్లించేందుకు నిరాకరించిన తయారీదారులపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు నిలిపివేయడం, ఆర్డర్లు తిరస్కరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని దాచేందుకు ఎన్‌క్రిప్టెడ్ వాయిస్ కాల్స్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది. ఇందులో బూనేటి చాణక్య , ముప్పిడి అవినాష్ అలియాస్ సుమిత్, మహ్మద్ సైఫ్ వంటి వారు కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది.కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని సిండికేట్ రాష్ట్రంలో మద్యం కొనుగోలుపంపిణీ వ్యవస్థను ప్రభావితం చేసి బహుకోట్ల కుంభకోణం నిర్వహించినట్టు ఈడీ పేర్కొంది. ఘారాదీజా కొనుగోలు ప్రక్రియలో జోక్యం చేసి రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.3,500 కోట్ల నష్టం కలిగించినట్టు దర్యాప్తులో తేలింది. సిండికేట్ సభ్యులు కిక్‌బ్యాక్‌ల రూపంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలను నియంత్రణలోకి తీసుకుని వాటి ద్వారా అక్రమ ఆదాయం సృష్టించినట్టు ఈడీ తెలిపింది. అదాన్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, లీలా డిస్టిలరీలు, యూ.వి. డిస్టిలరీలు వంటి సంస్థలకు అధిక వ్యాపారం కల్పించినట్టు పేర్కొంది. మద్యం రవాణా టెండర్‌ను సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి గతంతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించినట్టు కూడా వెల్లడించింది. ఆ కాంట్రాక్టు ఆదాయంలో కొంత భాగాన్ని ఇతర సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలు ముడిసరుకు, ప్యాకేజింగ్ సరఫరా పేరుతో కల్పిత కంపెనీలను ఉపయోగించి నిధులను నగదుగా మార్చినట్టు ఈడీ తెలిపింది. ఈ అక్రమ నిధులను భూములు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మార్గాల్లో పెట్టుబడిగా మార్చినట్టు వెల్లడించింది. ఇందుకోసం ఈశాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఈడి ఎంటర్‌టైన్‌మెంట్, యూని కార్పొరేట్ సొల్యూషన్స్, ట్యాగ్ డెవలపర్స్ వంటి సంస్థలను వినియోగించినట్టు తెలిపింది.కొనుగోలు, సరఫరా విధానాలను ప్రభావితం చేసి సిండికేట్ నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అక్రమ ఆదాయం పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నగదు కిక్‌బ్యాక్‌లను హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాల్లో నిల్వ ఉంచినట్టు కూడా గుర్తించింది.ఇప్పటివరకు దర్యాప్తులో రూ.1,048.45 కోట్ల మనీ ట్రైల్ గుర్తించినట్టు ఈడీ వెల్లడించింది. ఇందులో నగదు, బంగారం రూపంలో చెల్లించిన కిక్ బ్యాక్ లు, డిస్టిలరీల నియంత్రణ, మద్యం రవాణా ద్వారా వచ్చిన లాభాలు ఉన్నాయి.ఈ అక్రమ ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేసి వ్యక్తిగత లాభాల కోసం వినియోగించినట్టు తేలింది. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

# పెళ్లిళ్లు..ఓదార్పులేనా....

**కడప, మార్చి 7, పెన్ పవర్:** గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా వెళ్లి బాధితుల్ని పరామర్శించేవారు. కానీ ఇప్పుడు ఆయన రూట్ మారిపోయింది. ఘోర విషాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను ఓదార్చడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. పార్టీ నేతలు అరెస్టు అయితే యాత్రగాతో వెళ్లి పరామర్శలు చేస్తున్నారు. అదికూడా కొంత మంది కే. మిగిలిన వారిని ఇంటికి పిలిపిచుకుని ఓదారుస్తున్నారు. ఇక ప్రజాసమస్యలు.. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే మాత్ర అసలు వెళ్లడం లేదు. ఈ నెలలో రెండు, మూడు ఘోర విషాదాలు ఏపీలో జరిగాయి. ఒకటి కల్తీ పాల విషాదం, రెండు బాణసంచా విషాదం. ఉత్తరాధ్రలో డయోరియా వల్ల కూడా కొంతమంది చనిపోయారు. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడుప్రతిపక్ష పార్టీలు హడావుడి చేస్తాయి. కానీ జగన్మోహన్ రెడ్డి అసలు పట్టించుకోలేదు జగన్ పరామర్శలు చేస్తారని వైసీపీ వర్గాలు అనుకున్నా.. ఈ వారం ఆయన పెళ్లిళ్లకు మాత్రమే పరిమితమయ్యారు. గత రెండేళ్లుగా జగన్ చేస్తున్నది ఇదే. వైసీపీ ఓడిపోయిన తర్వాత జగన్ రాజకీయం పూర్తిగా విజిటింగ్ ప్రొఫెసర్ తరహాలో జరుగుతోంది. వారానికి మూడు, నాలుగు రోజులు మాత్రమే తాడేపల్లిలో ఉంటున్నారు. బుధవారం వచ్చి శుక్రవారం బెంగళూరుకు వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో ఓ ప్రెస్మీట్ లేకపోతే పార్టీ నేతలతో సమావేశం సందర్భంగా మాట్లాడి ఆ వీడియోలను విడుదల చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లిన సందర్భాలు తక్కువ. ఓ సారి చిత్తూరులో మామిడి రైతులకు సంఘిభావం తెలిపేందుకు

వెళ్లారు. ఆ తర్వాత పార్టీ నేతల ఇళ్లకు పరామర్శలకే వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి తన పర్యటనలను ఎక్కువగా రాజకీయ కారణాలకే పరిమితం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత జగన్ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తిరస్కరించారన్న భావనలో జగన్ ఉన్నారని .. ఆ అసంతృప్తి ఆయనలో ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే జగన్ స్వయంగా తనకు నలభై శాతం ఓటు బ్యాంక్ ఉందని చెబుతూ ఉంటారు. ఆ కోణంలోనే ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన ప్రతిపక్ష హోదాలో ఉండి కూడా, ఆయన కేవలం ప్రెస్ నోట్లు, సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కావడం పార్టీ క్యాడర్ ను అసంతృప్తికి గురి చేస్తోంది. అయితే వైసీపీ పెద్దలు మాత్రం మరో విధంగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైకాపా నాయకులపై కేసులు బనాయిస్తోందని, వారిని కాపాడుకోవడమే ప్రస్తుతానికి ప్రాధాన్యత అని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో గెలిచిన దగ్గర నుండే జగన్ జనంతో నేరుగా మమేకం అవ్వడం తగ్గించారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నాయి. ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా

అదే ధోరణి కొనసాగించడం రాజకీయంగా ఆత్మహత్యాసదృశ్యమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఒకప్పుడు ఓదార్పు యాత్ర పేరుతో ఊరూరా తిరిగిన జగన్, ఇప్పుడు అదే ప్రజలు కష్టాల్లో ఉంటే వెళ్లడానికి వెనకాడుతుండటం

ఆయన ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అయితే జగన్ మూడేళ్ల పాటు ప్రజా సమస్యలను పట్టించుకోకూడదని..చివరి రెండేళ్లు పాదయాత్ర చేస్తారు కాబట్టి అంతా కవర్ అయిపోతుదని పార్టీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రజలు ఆయన మూడేళ్లు ఏం చేశారన్నది మర్చిపోతారని. చివరి రెండేళ్ల పోరాటంతోనే ఓట్లేస్తారని అంటున్నారు.

# భారత్ vs న్యూజిలాండ్ మధ్య ఫైనల్ ఫైట్.. నేడు కెప్టెన్ రిటైర్మెంట్?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ ఫైనల్ లో న్యూజిలాండ్ జట్టుతో భారత్ తలపడనుంది. సొంతగడ్డపై, భారీ అభిమాన సందోహం మధ్య కప్పు గెలిచేందుకు టీమిండియాకు మెరుగైన అవకాశాలే ఉన్నాయని క్రీడా విశ్లేషకులు అంటున్నారు. ఈ మ్యాచ్ అయ్యాక ఇండియన్ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే సూర్యకుమార్ 35 ఏళ్ల వయసు పెరిగింది, ఫామ్ తగ్గింది. కెరీర్ డైలామాలో ఉంది. కాబట్టి రిటైర్మెంట్ కి ఇది సరైన సమయమే.. వరల్డ్ కప్ గెలిచి రిటైర్మెంట్ ఇవ్వడం అనేది అతడి ఇష్టం.కాగా సూర్య కుమార్ యాదవ్ ఇప్పటి వరకు టెస్టుల్లో ఒకే మ్యాచ్ ఆడాడు.. రెండేళ్లు వన్డే జట్టులో ఆడినా.. 2023 ప్రపంచకప్ ఫైనల్లో పేలవ ప్రదర్శనతో అతడిపై వేటు పడింది. ఇక అప్పటి నుంచి టీ20లకి మాత్రమే అతడు పరిమితం అయ్యాడు. ఏడాదిన్నర కిందట వెస్టిండిస్ తో టీ20 ప్రపంచకప్ గెలిచాక.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఒకేసారి టీ20 ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. రోహిత్ స్థానంలో టీ20 జట్టు పగ్గాలు అందుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్. అతడి సారథ్యంలో భారత జట్టు ఒక్కటంటే ఒక్క సిరీస్ కూడా ఇప్పటి వరకు ఓడిపోకపోవడం గమనార్హం. ఇప్పుడు సొంతగడ్డపై జరుగుతున్న టీ20 పొట్టి కివీస్ తో ఫైనల్ ఆడబోతోంది. ఇందులో గెలిస్తే.. జట్టుకి ప్రపంచకప్ అందించిన కెప్టెన్ గా దిగ్గజాల జాబితాలో చేరతాడు.. టీ20 క్రికెట్ నుంచి రిటైరవ్వడానికి ఇంతకంటే మంచి ఛాన్స్ మరొకటి ఉండదు. ఒకవేళ భారత జట్టు ఫైనల్లో ఓడితే.. సూర్యకుమార్ యాదవ్ కి మరో ఛాయిస్ లేదు. అతడిపై సెలక్టర్లు వేటు వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. వాళ్లకు ఛాన్స్ ఇవ్వకూడదు అనుకుంటే.. తనే స్వయంగా రిటైర్మెంట్ ప్రకటించాల్సిన

పరిస్థితి నెలకొంది. ఎందుకంటే కెప్టెన్ అయిన దగ్గర నుంచి అతడు పెద్దగా రాణించిన దాఖలాలు లేవు. కెప్టెన్ కావడానికి ముందు సూర్య 68 మ్యాచ్లో 43.33 సగటుతో 2,340 రన్స్ చేశాడు. అందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. కానీ కెప్టెన్ అయ్యాక 41 మ్యాచ్ లలో 26.62 సగటుతో 932 రన్స్ చేశాడు. ఒక్క సెంచరీ లేదు.. కెప్టెన్ కావడం వల్లే జట్టులో కొనసాగుతున్నాడు కానీ.. ఇలాంటి ప్రదర్శన చేసిన ప్లేయర్ పై వేటు పడేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సూర్యకుమార్ ఆధ్వర్యంలో టీమిండియా వరుసగా సిరీస్ లు గెలిచిన.. అందులో అతడి పాత్ర పెద్దగా లేదని విమర్శలు వచ్చాయి. దీంతో సూర్య నిజంగానే ఫైనల్ అనంతరం రిటైర్మెంట్ ఇస్తాడా లేదా అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతుంది.

# అభిషేక్ శర్మని జట్టు నుంచి తప్పించండి.. ఫైనల్‌కి ముందు మాజీ క్రికెటర్ షాకింగ్ కామెంట్స్






**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కీలక సూచన చేశాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించి రింకూ సింగ్‌కు అవకాశం ఇవ్వాలని తెలిపాడు. ఈ టోర్నమెంట్‌లో అభిషేక్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నాడు. జింబాబ్వేపై ఒక అర్ధశతకం తప్ప ఇతర మ్యాచ్‌లలో అతను పెద్దగా రాణించలేదని గుర్తు చేశాడు. బ్యాటింగ్‌లోనే కాదు, ఫీల్డింగ్‌లో కూడా అతను కొన్ని కీలక క్యాచ్‌లు వదిలేయడంతో జట్టుపై తీవ్ర ప్రభావం చూపించిందని వ్యాఖ్యానించాడు.

టీ20 వంటి చిన్న ఫార్మాట్‌లో మార్పులు చేయడం తప్పు కాదు.. వెస్టిండీస్ జట్టు కూడా ఇదే విధంగా రోస్టన్ చేజ్‌ను ఓపెనర్‌గా పంపింది అని మహమ్మద్ కైఫ్ తెలిపారు. పెద్ద మ్యాచ్ కి ముందు మార్పులు చేయడం కొన్నిసార్లు జట్టుకు ప్రయోజనం కలిగిస్తుందని వెల్లడించాడు. సంజు శాంసన్‌ను జట్టులోకి తీసుకురాగానే అతను అద్భుతంగా ఆడాడు.. ఆ మార్పుతో జట్టుకు లాభం కలిగిందన్నారు. భారత జట్టులో అనుభవజ్ఞులైన ప్లేయర్స్ చాలా మంది ఉన్నారని చెప్పుకొచ్చాడు. రింకూ సింగ్ ఎక్కడ ఆడినా పరుగులు చేసే ఆటగాడు.. టెస్టులు, రంజీ ట్రోఫీ లేదా ఐపీఎల్ అయినా అతడు తన ప్రతిభను నిరూపించుకున్నాడని పేర్కొన్నాడు. ఒక ఆటగాడు ఫామ్‌లో లేకపోతే, బయట మంచి ఫామ్‌లో ఉన్న ప్లేయర్ కి అవకాశం ఇవ్వడం తప్పు కాదని చెప్పాడు. డగౌట్‌లో రింకూ సింగ్ ఉన్నప్పుడు అతనికి ఎందుకు ఛాన్స్ ఇవ్వడం లేదని కైఫ్ ప్రశ్నించాడు. అభిషేక్ శర్మను సంజు శాంసన్‌తో పోల్చడం సరికాదని కైఫ్ అన్నారు. అభిషేక్ ఇంకా ఐసీసీ టోర్నమెంట్‌లలో కొత్త ప్లేయర్, శాంసన్ మాత్రం అనుభవజ్ఞుడైన ఆటగాడని వివరించాడు. అతడు టీ20 క్రికెట్‌లో 8000కుపైగా పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో అత్యుత్తమ హిట్టర్లలో ఒకడిగా నిలిచాడు. ఇప్పటికే స్థిరమైన ఆటగాడిగా శాంసన్ గుర్తింపు పొందాడు. కానీ అభిషేక్ శర్మ ఇంకా యంగ్ క్రికెటర్ మాత్రమే.. తన ఆటను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మరో ఆటగాడు వరుణ్ చక్రవర్తి ప్రదర్శనపై కూడా చర్చ జరుగుతున్నప్పటికీ అతన్ని జట్టు నుంచి తప్పించే అవకాశం తక్కువగా ఉందని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తెలిపాడు. వరుణ్ చక్రవర్తి వచ్చే మ్యాచ్‌లో తన బౌలింగ్ లైన్‌ను మార్చి మెరుగ్గా బౌలింగ్ చేసే ఛాన్స్ ఉందన్నాడు.

# టీ20 ప్రపంచ కప్ ఫైనల్స్‌లో టీమిండియా రికార్డులు..




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరిన భారత జట్టు మరోసారి చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో నిలిచింది. న్యూజిలాండ్‌తో జరగనున్న ఈ ఫైనల్ పోరుతో టీమిండియా టీ20 ప్రపంచకప్ చరిత్రలో నాలుగోసారి ఫైనల్‌కు చేరిన తొలి జట్టుగా రికార్డుల్లోకి ఎక్కింది. ఇప్పటి వరకు ఇండియన్ టీమ్ మూడు సార్లు ఫైనల్ ఆడగా, అందులో రెండు సార్లు టైటిల్‌ను దక్కించుకుంది. ఈసారి కూడా ట్రోఫీని గెలిచి ప్రపంచ క్రికెట్ లో అధిపత్యం ప్రదర్శించాలని చూస్తుంది.

**2007 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన మొదటి టోర్నమెంట్ 2007లోనే భారత్ ఫైనల్‌కు చేరుకుంది. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలోని యువ భారత జట్టు అద్భుత ప్రదర్శనతో పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఐదు పరుగుల తేడాతో విజయం సాధించి మొదటిసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆ ఫైనల్ మ్యాచ్ లో గౌతమ్ గంభీర్ కీలక పాత్ర పోషించాడు. జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అతడు 54 బంతుల్లో 75 పరుగులు చేసి భారత జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు.

**2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

టీమిండియా రెండోసారి 2014లో టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరింది. బంగ్లాదేశ్‌లోని ఢాకాలోని షేర్---ఎ---బంగ్లా నేషనల్ స్టేడియంలో శ్రీలంకతో జరిగిన ఫైనల్‌లో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆ విజయంతో శ్రీలంక తన తొలి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని గెలుచుకుంది.

**2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

2024లో భారత్ మూడోసారి ఫైనల్‌కు చేరి దక్షిణాఫ్రికాపై 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో టీమిండియా రెండోసారి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆ ఫైనల్ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అద్భుతమై ఇన్నింగ్స్ ఆడాడు. 76 పరుగులు చేసి టీమిండియా జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ ప్రదర్శనకు గాను అతనికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు వరించింది.

**2026లో చరిత్ర సృష్టించే ఛాన్స్:**

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ మరోసారి ఫైనల్‌కు చేరుకుంది. న్యూజిలాండ్‌తో జరిగే ఈ తుది పోరులో విజయం సాధిస్తే టీమిండియా మరో చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో వరుసగా టైటిల్‌ను కాపాడుకున్న తొలి జట్టుగా నిలవనుంది.

# దళపతి 'జన నాయగన్' కోసం ఆ ముగ్గురు!



**ప్రగ్యా జైస్వాల్ ఎల్లప్పుడూ మంచి సూర్యాస్తమయాన్ని అభినందిస్తూ ఉంటుంది**



**మృణాల్ ఠాకూర్ సొగసైన బ్లాక్ చీర లుక్‌లో స్టన్స్**

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి కథనాయకుడిగా నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ -జన నాయగన్-. ఈ మూవీని ఏ క్షణాన మొదలు పెట్టారో కానీ అడుగడుగున ఇబ్బందులే తలెత్తుతున్నాయి. ఇంత వరుకు ఏ స్టార్ హీరో సినిమాకు రాని ఇబ్బందులు ఈ మూవీకి ఎదురవుతున్న విషయం తెలిసిందే. విజయ్ నటించిన చివరి సినిమా సాఫీగా రిలీజ్ అవుతుందని అభిమానులు, ఇన్నేళ్లు స్టార్ హీరోగా అభిమానుల్ని అలరించిన కథానాయకుడిగా గ్రాండ్‌గా ఫేర్‌వెల్ ఇవ్వాలని మేకర్స్ భారీ స్థాయిలో రిలీజ్ కోసం ప్లాన్ చేసుకోవడం తెలిసిందే.జనవరి 9న పొంగల్ బరిలో భారీగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అయితే సెన్సార్ బృందం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించడంతో సినిమా రిలీజ్ వాయిదాపడి అంతరిని షాక్‌కు గురి చేసింది. మేకర్స్ షాక్ నుంచి తేరుకుని మద్రాస్ హైకోర్టుని ఆశ్రయించడం, కోర్టు సెన్సార్ వారిని మందలించి సర్టిఫికెట్ జారీ చేయాల్సిందేనని తీర్పు చెప్పడంతో అభిమానులు, మేకర్స్ ఊపిరి పీల్చుకున్నారు. ఇక సినిమా రిలీజ్‌కు ఎలాంటి అడ్డంకులు లేవని సంబరాలు చేసుకున్నారు.



ఇక్కడే డామిట్ కథ అడ్డంతిరిగింది. సీబీఎఫ్‌సీ వర్గాలు మద్రాస్ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుని సవాల్ చేయడంతో మళ్లీ కథ మొదటికొచ్చి -జన నాయగన్- రిలీజ్ ఆగిపోయింది. ఫైనల్‌గా సినిమా చుట్టూ జరుగుతున్న వివాదాన్ని అర్థం చేసుకున్న మేకర్స్ సెన్సార్ వారికి వ్యతిరేకంగా వేసిన పిటీషన్‌ని రిటర్న్ తీసుకుని వారు అడిగిన కట్స్‌కు అంగీకారం తెలుపుతూ ఫైనల్ కట్‌ని రివైజింగ్ కమిటీకి పంపించి గత కొన్ని రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఫైనల్‌గా రివైజింగ్ కమిటీ నుంచి మేకర్స్‌కి మెయిల్ వచ్చేసింది.మార్చి 9న మధ్యాహ్నం 2 గంటలకు సినిమాని రివ్యూ చేస్తామని ప్రకటించారు. దీంతో కేవీఎన్ ప్రొడక్షన్ వర్గాల్లో కొత్త ఉత్సాహం మొదలైంది. రివైజింగ్ కమిటీ సినిమా చూసి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వబోతోంది. మార్చి 9న కానీ, లేదా రెండు మూడు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేస్తే సినిమాని ఇదే నెలలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే దళపతి కోసం ముగ్గురు స్టార్ డైరెక్టర్లు రంగంలోకి దిగినట్టుగా తెలుస్తోంది. విజయ్‌తో భారీ సినిమాలని అందించిన లోకేష్ కనగరాజ్, అట్లీ, నెల్సన్ దిలీప్ కుమార్ ఈ మూవీలోని ఓ కీలక ఘట్టంలో అతిథి పాత్రల్లో కనిపించనున్నారని తెలిసింది.

విజయ్ చివరి సినిమా కావడంతో ఈ ముగ్గురు డైరెక్టర్లు ఇందులో అతిథి క్యారెక్టర్లలో కనిపిస్తారని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఇదిలా ఉంటే తెలుగు సూపర్ హిట్ ఫిల్మ్ -భగవంత్ కేసరి- ఆధారంగా ఈ మూవీని రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఇంత వరకు ఆ విషయాన్ని అధికారికంగా అంగీకరించని మేకర్స్ ఫైనల్‌గా ఈ మూవీ డిటైల్స్‌లలో ఇది -భగవంత్ కేసరి- రీమేక్ అని ప్రకటించడం గమనార్హం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com